ఆంధ్రమహిళ



ఏప్రిల్ 1959

విడిప్రతి : 37 న. పై.

సింగినాదం

(నవల)

రచయిత్రి :

కె. లక్ష్మీరఘురామ్

మూడురంగుల ముఖచిత్రం

వెల : 1-50 న. పై.

ప్రాప్తిస్థానం :

ఆంధ్ర మహిళా ప్రెస్

7-ఎ, రోజరీ చర్చి రోడ్డు, మద్రాసు 4.

ఆంధ్ర మహిళ

సంపుటి 15 :: ఏప్రిల్ '59 :: సంచిక 4

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపాదకురాలు :
కె. లక్ష్మీరఘురామ్.

★

సంయుక్త సంపాదకురాలు
రామలక్ష్మిఆరుద్ర.

విషయసూచిక

ముఖచిత్రం : ఉగాది సుందరి

కానుక

వి. ప్రభావతి

కవిరాజు మనసులో
కదిలేటి కవితా
భావమై పారాడు
పాపాయి కవితా

చిరునవ్వులొలికించు
చిన్నారి కవితా
పరుగున రావమ్మ
బహుమాన మిత్తు

కూర్చినానొక చిన్ని
గేయమ్ము నీకై
కానుకగా చిన్నారి
కవితామ తల్లీ !

అక్షరమ్ముల తీసి
గ్రుచ్చి నానమ్మ
తెలుగు పువ్వుల దండ
తురుము కోవమ్మ

భావ మనియెడి చిన్ని
పట్టు చొక్కాను
పరికిణీ కుట్టాను
పదములను కలిపి

ఛందస్సునీ కాలి
అందెగా చేసి
గజ్జెలు కట్టాను
గణములను చేర్చి

ఫాలమున 'శ్లిక'ను
తిలకమ్ము దిద్ది
హృదయగత భావమును
హారతిచ్చాను

మాలోని మమతలే
మంగళాక్షతలు
తెలుగు బాలల చెలిమి
శ్రీరామ రక్ష

ఆరోగ్య భాగ్యములు
ఐశ్వర్యములును
పదగుంఫనము కల్గి
వర్ధిల్ల వమ్మా

పసుపు కుంకుమలలో
భావ సంపదతో
నూరేళ్ళు వర్ధిల్లు
నిత్య నూతనమై

★

ఆంధ్రమహిళ

సంపుటి 15 :: ఏప్రిల్ 59' :: సంచిక 4

స్త్రీల స్వర్ణయుగం

విళంబి చల్లగా జారుకుంటుంది. వికారి మెల్లగా చేరుకుంటుంది. ఈ సంవత్సరము మనము సాధించిన దేమిటి? దేశ రాజకీయ సాంఘిక పరిస్థితులు అవలోకించుదాము. రాజకీయ అధినేత నేడు స్త్రీ. స్త్రీ నాయకత్వముననే మన దేశమునకు మోక్షము కలుగగలదని మా దృఢ విశ్వాసము. రాజకీయాలతో పాటు సాంఘికముగాకూడా భారతీయులు జోరుగా ముందడుగు వేయవలసియున్నది. తప్పటడుగులు వేయలేదు. అడుసు త్రొక్కలేదు. సాగిపోతున్నారు. అభ్యుదయముఖులై భారతీయులు.

రాజకీయాలట్లు వుంచి సాంఘిక అభ్యుదయము, ఆ కార్యక్రమములో నిమగ్నులైన వారిసేవ అవలోకించుదాము.

1953 లో ప్రారంభించిన సాంఘిక సంక్షేమ సంఘము మొన్న ఢిల్లీలో ఐదవవార్షికోత్సవము శ్రీ పండిత నెహ్రూ సమక్షాన జరుపుకొన్నది. అవిద్య, దారిద్ర్య మలుముకున్న దేశములో సాంఘిక సేవాభ్యుదయమునకు క్షణ క్షణము అంతరాయములే. అట్టి క్షేత్రములో నిర్విఘ్నముగా తమ నిర్ణీత కార్యక్రమము ఈ సంఘ సంక్షేమ శాఖయే కొనసాగించ కలిగింది. దినదిన గండముగా జరిపే అనేక సేవా సంస్థలకు పునర్జీవనము కలిగించి, అన్నిహంగులతో నిర్విరామ కృషితో జరుపుచున్న పెక్కు సంస్థలకు చేయూతనిచ్చి, క్రొత్త సంస్థలను ఏర్పరుచుట, వాటికి పురిటిసంధి కొట్టకుండ సంరక్షించుటలో ఈ సంఘమువారు నిమగ్నులైనారు. బహు నేర్పు అనుభవము, అసమాన నైపుణ్యాము తలచుకొన్నది చేయగల శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారి ఆధ్వర్యమున మన దేశములో సాంఘిక సంక్షేమ సంఘము భావిభారత నిర్మాణములో ప్రముఖముఖ్య కార్యక్రమములను విజయవంతముగా ఈ ఐదు సంవత్సరములు సాగించింది. ఇంకా సాధించవలసినది చాలావున్నది. భవిష్యత్తును గురించి ఆలోంచించె ముందు భూతవర్తమాన పరిస్థితులను పర్యవేక్షించుదాము. మొదటి పంచవర్ష ప్రణాళికలోని 4 కోట్లు రెండవ ప్రణాళికలోని 14 కోట్లు ఈ సాంఘిక సంక్షేమ కార్యక్రమముల క్రింద ఖర్చుఅయినది. మేమిదివరలో అనేకసార్లు హెచ్చరించినట్లు ఖర్చు చేయుటమందరికి చేతనయిన పనేకాని సక్రమముగా ఖర్చుచేయుట చాలాకష్టము. ఈ 18 కోట్లులోనూ ఒక్కపైసా అయినా దుర్విని

యోగము కాకుండా సక్రమముగా వినియోగించి నందులకు మేము ఈ సంఘ కార్యకర్తలను అభినందించకుండా వుండలేము.

ఈ సంఘమును ఒక మంత్రిత్వ శాఖగా చేయవలయునను సలహానుగాని, ఒక ప్రభుత్వ శాఖగా చేయవలయునను సలహానుగాని మేము ఆమోదించనప్పటికి వుత్తరోత్తరా ఈ సంఘములో సేవ చేయుచున్న వేలాది స్త్రీ పురుషులకు ఒక స్థాయి, భద్రత కలిగించుట అవసరము. వారి వారి భవిష్యత్తు విచారణలో లీనమై ప్రస్తుత కార్యక్రమములు వుపేక్షించకుండ వుండుటకు వారికి భవిష్యత్తులో పని, జీతములు, భద్రతా, రక్షణలు ఇప్పుడే ఏర్పాటు చేయుట చాల అవసరము. భావి భద్రతా రక్షణ వుండినచో సంఘ సేవాభిలాషులు అప్రమత్తతో వారి కార్యక్రమములు సాగించగలరని మేము నమ్ముచున్నాము. ఎప్పటికైనా ఈ సంఘసేవా కార్యక్రమములు ప్రభుత్వోద్యోగులకన్నా స్వచ్ఛంద సంస్థలు ఎక్కువ నైపుణ్యముతో కృషి చేయగలవు. కావున మున్ముందు స్వచ్ఛంద సంస్థలకు మరింత ఎక్కువగా ఈ సంక్షేమ సంఘము చేయూత నివ్వగలదని మేము ఆశించుచున్నాము.

మూడవ పంచవర్ష ప్రణాళిక సమయము ఆసన్నమవుచున్నది. ఆ ప్రణాళిక తయారు చేయుటలో ఇతర సంఘములిప్పుడే నిమఘ్నులైనారు. కాని ఈ సాంఘిక సంక్షేమ సంఘము అట్టి ప్రణాళిక తయారు చేయుటలో ఇంకా పాల్గొన్నట్లు కనబడదు. మరి కొంతమంది స్త్రీలు ఈ సాంఘిక సేవలో ఆరితేరిన స్త్రీలు, అనుభవము గ్రహించి వారి సలహాల ప్రకారము మూడవ పంచవర్ష ప్రణాళికలో సాంఘిక సంక్షేమ కార్యక్రమములను రూపొందించగలరని నమ్ముచున్నాము — అంతేకాదు. ఇతర ప్రభుత్వ శాఖల సహకారము ఇప్పటికన్నా ఎక్కువగా వుండగలదని ఆశించుచున్నాము. ప్రభుత్వ వికాసవిస్తరణ శాఖలు ఇతర సాంఘిక సంక్షేమ సంబంధ శాఖల సంపూర్ణ సహకారముతో అనవసర వ్యయప్రయాసలు, కాలహరణము లేకుండా ఇప్పుడు స్త్రీలలో కలిగిన చైతన్యమును ద్విగుణీకృతము చేసి మూడవ పంచవర్ష ప్రణాళిక. ఆఖరుకు సంఘసేవా కార్యక్రమ అవసరమే లేకుండా చేయగలరని మేము ఆశిస్తున్నాము. విస్తృతాధికారాలను పొందిన పంచాయితీలు వీరి కృషిలో సహకరించగలవని విశ్వసించుచున్నాము. అంతేకాదు.

స్త్రీల యుగానికి నాంది పలుకవలసియున్నది. సాంఘిక పరిస్థితులేగాక ఇప్పటి రాజకీయ పరిస్థితులు అనుకూలముగాయున్నవి. ఇప్పుడే ఆ స్వర్ణ యుగానికి నాంది పలకవలసియున్నది. అదీ స్త్రీలే చేస్తే శుభప్రదముకదా?

★



రాజకీయాలు

విద్యా విషయాలు

ఆర్థిక సంబంధమైన వత్తిడులను, పొదుపు చర్యలను ఎదుర్కొంటూనే కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అజ్మాయిషీక్రింద గల అన్ని రంగాలలోనూ కార్యకలాపాలు తీవ్రంగా కొనసాగాయని ఆ మంత్రిత్వశాఖ 1958–59 వ సంవత్సరపు వార్షిక నివేదికలో తెలియజేయబడింది. ఈ నివేదిక పార్లమెంటుకు సమర్పించబడిందికూడా.

1958 ఏప్రిల్ 1 టవ తేదీనుంచి డిసెంబర్ 31 వ తేదీ వరకూ గల కాలంలో సాధించిన అభ్యుదయం 1959 జనవరి–మార్చి కాలంలో ఆశించబడిన అభివృద్ధి 1959–60 వ సంవత్సరంలో నిర్వహించనున్న కార్యక్రమం యీ నివేదికలో వివరించబడ్డాయి. ఈ నివేదికలో 127 పుటలున్నాయి. పూర్వపు విద్యా, వైజ్ఞానిక పరిశోధనల మంత్రిత్వశాఖ 1958 ఎప్రెల్ 1 టవ తేదీన విద్యా మంత్రిత్వశాఖ, వైజ్ఞానిక పరిశోధనలు, సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖక్రింద విభజించబడ్డాయి. పూర్వపు మంత్రిత్వశాఖ తాలూకు విద్యావ్యవహారాల శాఖ నిర్వహించే ముఖ్య ముషయాలూ, వ్యాయామవిద్య, క్రీడలు, యువజన సంక్షేమాలకు సంబంధించిన వ్యవహారాలు మాత్రం విద్యా మంత్రిత్వ శాఖకు అట్టేపెట్టారు. పూర్వపు మంత్రిత్వశాఖ నిర్వహించే స్కాలరుషిప్పుల పథకాలకు సంబంధించిన విషయాలు యీ రెండు మంత్రిత్వ శాఖలకుల తిరిగి కేటాయించారు.

ఈ నివేదికలో యింకా యీక్రింది విషయాలున్నాయి. ప్రణాళికలో ఇటీవల జరిగిన మార్పుల ఫలితంగా విద్యాభివృద్ధికి మొదట్లో కేటాయించిన రు. 30 7 కోట్ల పెట్టుబడి వ్యయం రు. 275 కోట్లకు తగ్గించబడింది. మొదటి రు. 307 కోట్లలోనూ, రాష్ట్రాలపథకాలకు రు. 212 కోట్లు, కేంద్రపథకాలకు రు. 95 కోట్లు కేటాయించడం జరిగింది. ఇప్పటితగ్గింపుదృష్ట్యా తేలిన రు. 275 కోట్లలోనూ రాష్ట్రాలపథకాలకు రు. 207 కోట్లు కేంద్ర పథకాలకు రు. 63 కోట్లు లభిస్తాయి. పై రు. 63 కోట్లలోనూ విద్యా మంత్రిత్వశాఖ విద్యాభివృద్ధి పథకాలకు యిప్పుడు రు. 45 కోట్లు కేటాయింపు జరిగింది.

ద్వితీయ ప్రణాళికలోని పథకాలు సత్వరంగాను, చురుకుగాను అమలు జరిగేందుకు తోడ్పడే నిమిత్తం రాష్ట్రాలకు కేంద్రం చేసే సహాయంచెల్లింపు విధానం మార్పుచేయబడింది. కేంద్రం చేసేమొత్తం సహాయంలో నూటికి 75 వంతులు రాష్ట్రాలకు 9 నెలసరి సమాన వాయిదాలలో ఆర్థిక మంత్రిత్వశాఖ ఇస్తున్నది. మొదటి 9 నెలలోనూ సాధించిన అభివృద్ధి ప్రాతిపదికపైనా. బనకి మూడు నెలలో రాగల వ్యయం అంచనాపైనా. తుదిమొత్తం 1959 ఫిబ్రవరి లో ఇవ్వబడుతుంది. కొన్ని నిర్ణీత రంగాల విషయంలో మాత్రం యూనియన్ పాలక శాఖల అధిపతులు తమ ఆర్థిక అధికారాలకు లోబడిన పథకాలను కేంద్ర ప్రభుత్వ ఆమోదంకోసం కూర్చోకుండా. కొనసాగించాలని వారికి సలహాయివ్వడం జరిగింది.

ఉచిత ప్రాథమిక విద్య

5—11 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి 1965–66 వ సంవత్సరం నాటికి సార్వజనీన ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా సౌకర్యాలను కల్పించాలన్న లక్ష్యాన్ని సాధించడానికి యీ సంవత్సరంలో అనేక చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సలహాలతో వీటికి సంబంధించిన వివరాలు తయారుచేస్తున్నారు. ప్రణాళికా రచనా సంఘం తాలూకు విద్యా వేత్తలసంఘం యీ లక్ష్యాన్ని సిఫార్సును చేసింది. 1957 సెప్టెంబరులో జరిగిన విద్యా మంత్రుల సమావేశం యీసిఫార్సును ఆమోదించింది. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను త్వరలో ప్రవేశపెట్టడానికి కార్యక్రమాలను రూపొందించే నిమిత్తం 1957 జూన్‌లో నెలకొల్పిన అఖిలభారత ప్రాథమిక విద్యా వ్యవహారాల సంఘం సమీక్షా కాలంలో రెండుసార్లు సమావేశమైంది, ఆ సంఘం చేసిన పెక్కు సిఫార్సులను కేంద్రం, రాష్ట్రాలు అమలు పరుపునాయి.

విద్యా మంత్రిత్వశాఖ ప్రాథమిక విద్యకు సంబంధించిన ఒక నమూనాచట్టాన్ని రూపొందిస్తున్నది. త్వరలోనే సిద్ధ పరుస్తారు. విద్యా మంత్రిత్వ శాఖ సూచన మీదకు సమాజ వికాస కార్యక్రమ ప్రాంతాలలోనూ, జాతీయ విస్తరణ కార్యక్రమ ప్రాతాలలోనూ, సర్వంధ ప్రాథమిక విద్యలకు సంబంధించిన కొన్ని సమానాపథకాలు అమలు జరుపడానికి కొన్ని రాష్ట్రప్రభుత్వాలు అంగీకరించాయి. గ్రామప్రాంతాలలో ప్రాథమిక విద్యను విస్తరింపచేసి, విద్యావంతులలో నిరుద్యోగాన్ని తొలగించాలన్న లక్ష్యంతో ఒక పథకం ప్రవేశపెట్టబడింది. ఈ పథకం క్రింద 60,000 మంది టీచర్లనూ, 1200 మంది అట్మా యిషీ ఉద్యోగులనూ నియమించడానికీ, ద్వితీయ ప్రణా ళికా కాలంలోని చివరిమూడు సంవత్సరాలలో ఆడ టీచర్లకు 6,000 నివాసగృహాలను నిర్మించడానికి తల పెట్టారు.

ప్రాథమిక దశలో శాస్త్ర బోధనను అభివృద్ధి పరచ డానికి ఆదిలోరెండేళ్ళ పాటు ఒక నమూనా పథకాన్ని అమలు జరుపుతున్నారు. ఒక్కొక్క రాష్ట్రానికి ఒక్కొక్క ప్రాజెక్టు చొప్పున దీనిని నిర్వహిస్తున్నారు, శాస్త్ర బోధనను అభివృద్ధి చేయడానికి తగు సూచనలిచ్చే నిమిత్తం ప్రతి ప్రాజెక్టుకూ శాస్త్ర విషయాలు తెలిసిన ఒక సలహాదార్ని నియమిస్తారు.

బేసిక్ విద్య

పూర్వ–ప్రాథమిక, ప్రాతిపదిక విద్యల పెంపుదలకు సమీక్షా కాలంలో 61 స్వచ్ఛంద సంస్థలకు మొత్తం రు. 4. 48 లక్షలు గ్రాంటు యివ్వబడింది. ప్రాతిపదిక విద్యా విధానాన్ని విస్తరింప చేయడానికి రాష్ట్రప్రభు త్వాలకూ, స్వచ్ఛంద సంస్థలకూ ఉదారంగా సహాయం చేయబడుతున్నది. బేసిక్ స్కూళ్ళుకాని యితర పాఠ శాలలను బేసిక్ స్కూళ్ళుగా మార్చడానికి ఒక జాతీయ పథకం నిర్వహించబడుతున్నది. ఈ పథకం నిర్వహణకు తీసుకున్న వివిధ చర్యలకూ పూర్తి శిక్షణపొందిన సిబ్బందీగాని, పెద్దమొత్తాలధనంగాని అవసరంలేదు.

1956 ఫిబ్రవరిలో నెలకొల్పబడిన జాతీయ ప్రాతి పదిక విద్యా సంస్థ పరిశోధనలు, శిక్షణ, గ్రంథప్రచురణ లకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను విజయ వంతంగా నిర్వహిస్తున్నది. ప్రస్తుతంగల పోస్టు బేసిక్ పాఠశాలలను అభివృద్ధిచేయడానికీ, సెకండరీ దశలో గాని, బేసిక్ విద్యానంతర స్థాయిలోగాని కొత్త ప్రాతి పదిక విద్యా పాఠశాలలను నెలకొల్పడానికీ, రాష్ట్ర ప్రభు త్వాలకు నూటికి నూరు వంతులూ, స్వచ్ఛంద సంస్థలకు నూటికి 60 వంతులూ ఆర్థికసహాయం చేస్తున్నారు. సక్రమపద్ధతులలో నెలకొల్పబడిన నగర ప్రాతిపదిక విద్యాపాఠశాల ఎట్టిప్రయోజనాలను సాధించగలదో నిరూపించడానికిగాను న్యూఢిల్లీలో ఒక కేంద్ర బేసిక్ పాఠశాల నిర్మాణం సాగుతున్నది. బాలసాహిత్య బహు మతుల పోటీపథకం, బాలసాహిత్య రచయితల శిక్షణకు సాహిత్య రచనాలయాలస్థాపనపథకం. బాలసాహిత్య నమూనా గ్రంథాల రచనా పథకాలకు తోడు, మౌలికగ్రంథాలు మార్గదర్శకగ్రంథాలు, పటాలు, అను బంధ పఠన గ్రంథాలు, విషయ సేకరణగ్రంథాల రూపంలో ప్రాతిపదిక విద్యాసాహిత్యాన్ని ప్రచురించడానికి ఒక కార్యక్రమం అమలు జరుగుతున్నది.

బాలికా విద్యా

స్త్రీ విద్యావిస్తరణ. ఆడటీచర్ల శిక్షణ కలాపాలు 1953–59 లో బాగా ముందుకు సాగాయి. ఈ పథకం 1957–58 లో ప్రారంభమైంది. కేంద్రప్రభుత్వం ప్రతి పాదించిన యీ పథకంక్రిం 1957-53 లో మూడు రాష్ట్ర ప్రభుత్వాలకు మొత్తం రు. 93, 123 లు లభించాయి. సమీక్షా సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వాలకూ, యూనియను ప్రాంయలకూ 48, 74, 971 రూపాయలు మంజూరయి నాయి. అధ్యాపక శిక్షణపొందుతున్న స్త్రీలకు స్టైపండ్లు, బాలికలు పాఠశాలలకు హాజరయే నిమిత్తం యిచ్చే స్కాలరుషిప్పులు, ఆడటీచర్లకు ముఖ్యంగా గ్రామ ప్రాంతాలలో అద్దెలేని ఇళ్ళ నిర్మాణాలకుగాను యీ పథకంక్రింద కేంద్రం సహాయం చేస్తున్నది.

శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ అధ్యక్షతక్రింద 1953 మే నెలలో నెలకొల్పబడిన స్త్రీ విద్యా జాతీయ సంఘం 1959 జనవరి 5 వ తేదీన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ఇప్పుడు ప్రభుత్వ పరిశీలనలోవుంది. స్త్రీ విద్య, బాలికావిద్యలకు సంబంధించిన వివిధ సమస్యలను పరిశీలించడానికి యీ సంఘాన్ని నెలకొల్పారు.

సెకండరీ విద్య

సెకండరీ విద్యా పునర్నిర్మానానిరి 1955-59 వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మొత్తం రు. 3. 33 కోట్లను మంజూరు చేసింది. ఈ పథకం క్రింద 1953 మార్చి ఆఖరుకు 1143 బహుళార్థ సాధక

పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. ద్వితీయప్రణాళికా కాలం ఆఖరుకు ఇట్టివి 1137 పాఠశాలలను నెలకొల్పాలనేది నిర్ణయించిన లక్ష్యం. 1958 మార్చి ఆఖరుకు 340 హైయ్యర్ సెకండరీ పాఠశాలలను నెలకొల్పారు. సెకండరీ విద్యకు సంబంధించిన సమస్యల విషయంలో పరిశోధనలు జరపడానికిగాను 24 సంస్థలకు రు. 1, 57,412 లు మంజూరు చేశారు.

* * *

రష్యాలో మాక్మిలన్

సోవియట్ ఉపప్రధాని మైకోయెన్ ఆ మధ్యన అమెరికా వెళ్ళివస్తే బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ రష్యాలో స్వేచ్ఛగా పర్యటించివచ్చాడు. నిజానికి మైకోయెన్ వచ్చి వెళ్ళిన తరువాత రష్యాలో పర్యటింప వలసిన వ్యక్తి మాక్మిలన్ కాదు, డల్లెస్. కాని డల్లెస్ ప్రస్తుతం ఆస్పత్రిలో వుండడంతో యీ విషయం చర్చనీయాంశం కాలేదు.

ఏదైనా, ప్రచ్ఛన్న యుద్ధంతో ప్రారంభం అయిన పర్యటనల జోరు వల్ల వచ్చే లాభాల ఫలితం ఎలా వుంటుందన్నది చర్చనీయాంశం; చెప్పడం కష్టం కూడ. మైకోయెన్ పర్యటన ఫలితాలు ఎలాంటివో రష్యా బహిర్గతం చెయ్యలేదు. పోతే యిటువంటి పర్యటనల వల్ల ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణంలోని స్తబ్ధత కొంచెం తగ్గే సూచనలు కానవస్తున్నట్లు ఉభయ వర్గాల నుండీ మాటలు వినవస్తున్నాయి. సమస్యలు సమస్యలలాగే వుండిపోయినా, ఉభయ దేశాల నాయకులూ ముఖాముఖి మాట్లాడుకొనడం కొంతలో కొంత కోరుకోతగ్గదే. ఇటువంటి రాకపోకలు ప్రముఖుల దృక్పథాలు మార్చలేక పోయినా, రెండు దేశాల ప్రజల మధ్యా తప్పక సుహృద్భావం పెంపొందుతుంది.

మైకోయెన్ అమెరికా వెళ్లి ఐసెన్‌హోవర్ డల్లెస్‌ల పోలసీలని జయింప లేకపోయినా, అక్కడి ప్రజల హృదయాలని చూరగొన్నాడు. కాని మాక్మిలన్ పర్యటనల వల్ల అది కూడా జరిగిందని చెప్పలేము. ఈ రష్యా దర్శనంలో చాలా భాగం మౌనం వహించాడు మాక్మిలన్. అధికార యుతమైన సంభాషణలలో తప్పించి ప్రజలలో కలిసి ప్రజల మనిషిగా మాక్మిలన్ వర్తించలేదు. అదీ కాక, సోవియట్ ప్రజలను ఆకర్షించే ఏవీ బ్రిటిష్ వారి దగ్గిరలేవు. అందుకే సమస్యలు సమస్యలుగానే వుండిపోయాయి. చివరకు తేలినది— జర్మనీ పరిష్కారం పట్ల రెండు దేశాల మధ్యా ఏకీభావం కుదరలేదు. సాంస్కృతిక సంబంధాలకు మటుకు ఒప్పందాలు జరిగాయి.

స్తబ్ధ వాతావరణాన్ని మార్చడానికి యిటువంటి పర్యటనలు ఉపయోగిస్తాయన్నది మటుకు రూఢి. కాని యీ పర్యటనల జయాపజయాలు నిర్ణయించే సరుకు రష్యా వారి వద్ద వున్నంతగా పశ్చిమ రాజ్యాల దగ్గిర ఉన్నట్టు తోచదు.

♦ ♦ ♦

రాష్ట్ర విశ్వ విద్యాలయాలలో బోధనా భాషగా ఇంగ్లీషు స్థానే యింకొకటి నిర్ణయించడం ప్రస్తుతం సాధ్యంకాదని ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీలో విద్యా మంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు ప్రకటించారు. ఇంగ్లీషు భాషలో విశదపరచుకొన్నంతగా కొన్ని విషయాలు మాతృ భాషలలో అర్థం చేసుకోవడం కష్టం అన్న విషయం నిజం.

మహిళల విద్యా విషయాలను గురించి శ్రీమతి దుర్గాబాయీ దేశ్‌ముఖ్ సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తూందనీ, యోగ్యత ప్రాతిపదికగా విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు యివ్వడానికై బడ్జట్‌లో మూడు లక్షలు కేటాయింప బడ్డాయనీ విద్యా మంత్రి తెలియచేశారు.

♦ ♦ ♦

భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్రసాద్ కాంబోడియా దర్శించిన సందర్భంలో కాంబోడియా ప్రజలు విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం యిచ్చారు. కాంబోడియా స్వతంత్రరాజ్యమైన తరువాత ఆ దేశాన్ని దర్శింప బోయిన తొలి విదేశాధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్. విమానాశ్రయం వద్ద, కాంబోడియనులు, వియత్నాం జనులు, చైనీయులూ భారతీయులూ గుమిగూడి జయ జయధ్వానాలు చేశారు.

రాజేంద్ర బాబు కాంబోడియా పార్లమెంటులో ఉపన్యసిస్తూ, ప్రజానీకం అంతా స్వేచ్ఛ స్వాతంత్ర్యాలని అనుభవించి ఆనందించాలంటే— ఆ స్వాతంత్ర్యం అహింసా పునాదిపై నిలపెట్టాలన్నారు.

నిర్వాసుల పునరావాసం



నిర్వాసులకి పునరావాసం కల్పించడం- ఒక్క తల దాచుకొనే స్థలాన్నీ, భుక్తి గడవడానికి భూమినీ యివ్వడంతో ఆగిపోదు, కొత్త పనులు నేర్చుకొని కొత్త వాతావరణాన్ని సృష్టించుకొని, జీవన భృతి గడించుకోవడం నేర్పించాలి. దీనికోసమే, నిర్వాసుల పునరావాస కార్యక్రమాలన్నిటిలోను కూడా చిన్న చిన్న చేతి పనులు చేసుకోవడం, వృత్తులు నేర్పడం మొదలైన వాటికి ప్రాముఖ్యం యివ్వబడుతూంది. అప్పుడే వీరు శాశ్వతంగా పునరావాసం కల్పించుకోవడం జరుగుతుంది.

పై చిత్రంలో, పశ్చిమ బెంగాలులోని ఒక శిక్షణ కేంద్రంలో ఇద్దరు వనితలు చాప మీద అల్లిక పని నేర్చుకోవడం చూడవచ్చు.



తిందాము, తిందాము

తిందాము, తిందాము అన్నదట చిన్నారి చిటికన వ్రేలు. వజ్రాల ముద్దు టుంగరము ధరించిన వుంగరపు వ్రేలు ఎక్కడ తెద్దామన్నదట. అప్పుచేసి పప్పుకూడు తినటానికి అలవడిన మధ్యవ్రేలు అప్పుచేసి తిందామని సలహా ఇచ్చిందట. అప్పెట్ల తీరుద్దామని సందేహాన్ని వెలువర్చింది సత్యకాలపు చూపుడు వ్రేలు— ఎగేసి పారిపోదామంది అసాధ్యురాలు— బొటనవ్రేలు బలగర్వముతో- క్రిందా మీదా బడి తర్జన భర్జనలైన తరువాత తిందామనే నిర్ణయించుకున్నారు.

ఏదో శుచైనవి, రుచైనవి తిందామనుకున్నది చిటికనవ్రేలు. పంచభక్ష్య పరవాన్నములు కావాలన్నదివుంగరపు వ్రేలు—బ్రతకటానికి తినుచున్నాము, తింటానికి బ్రతుకుచున్నామని వళ్లు మండి భీష్మించుకు కూర్చున్నవి మిగిలిన మూడేళ్ళు.

లోకము తీరే అంత. అసలు లేనప్పుడు ఆకలి మండుతూవుంటే ఏదో ఒకటి తినటానికి దొరికితే చాలని వుంటుంది. లేంది దొరికిన తరువాక అదిగాదు ఇది, ఇదిగాదు అది కోరుకుంటుంది- మరీ తినటానికే పుట్టిన వాళ్లకి ఏమీ బాగుండవు- ఎప్పుడు క్రొత్త రుచుల కోసము వెతుక్కుంటూనే వుంటారు. పోనీ బాగుండ లేదన్నవి తినకుండా వుంటారంటే అదీ కాదు. బాగుండలేదంటూనే తింటూ వుంటారు. అది వారికొక రోగము. అన్నమైతేనేమి సున్నమైతేనేమి అంటూ అన్నమే, అందులో వంకసన్నాల భోజనము తిన్నా అందులో , ఒక అర్థమున్నది గాని, ఇది బాగుండలేదు, అది బాగుండలేదని తినటములో అందములేదు, బాగుందని అంటూనే తింటే వారికి మంచిది. చూచేవారికీ బాగుంటుంది.

కాని ఒక చిక్కు. రుచైనవి ఎక్కువ తినకూడదనేది మనము పెద్దబాల శిక్ష రోజుల్లోనే నేర్చుకున్నాము అనుకోండి. పోతే రుచిగా లేనివైనా ఎక్కువ తింటె, ప్రమాదమే. మితముగా తింటే ఏ చిక్కూలేదు. వైద్యులు చెప్పినా యోగులు చెప్పినా భోజనము మితంగా చెయ్యాలనే. అసలు కావలసిన దానికన్నా కొంచెము తక్కువగా భోంచేస్తే అన్నిటికీ మంచిది. జబ్బులు తగ్గుతవి. ఎక్కువ పని చేసుకోవచ్చు. అంతే కాకుండా కొంత మంది కడుపులు కొట్టి తాము అజీర్ణ బాధతో అవస్త పడటము తగ్గుతుంది, ఎటు నుంచీ చూచినా తక్కువ ఆహారము తింటే మంచిది. మన దేశపు ఆహార సమస్య కొంచెము తక్కువ క్లిష్టతర మౌతుంది.

ఈ రకాలు గాక ఇంకో దగుల్బాజీ రకమున్నది. ఈ రకానికెప్పుడు పొరిగింటి పుల్లకూర రుచి. ఈ

మహానుభావులకు ఇంట్లో చేసినవి బాగుండవు. హోటల్లో చేసినవి ముఖ్యంగా బాగుంటవి. నెలాఖరుకి మాత్రము ఇంట్లోవే బాగుంటాయి. వండ లేనమ్మ పెట్టలేనమ్మకు హోటలు నుంచీ కారియరు తెప్పించుకోటానికిదో మామంచి వీలు.

ప్రపంచములో సృష్టింప బడ్డ జీవుల కన్నిటికి ఆహారము అవసరము- మానవుడు తప్ప మిగిలిన జీవులన్నీ మితముగానే అవసరమున్నంత వరకే తినును. అందుకనే వాటికి డాక్టర్లతో, ఔషధములతో వైద్యశాలలతో నిమిత్తములేదు. మానవుడొక్కడే అవివేకియై, ఆశతో పుట్టింది తినటానికోసమేనన్నట్లు రేపటికి కూడా ఈవేళే తిని కష్టపడతాడు- ఏమైన మానవునికి ఇంత చెడ్డ దూర దృష్టి వుండటము మంచిది కాదు. రుచులు జిహ్వా తన ఆధీనములో వుంచుకో గలిగినాడు యోగి. అది సాధించగలిగిన నాడు ఏమైనా సాధించగలుగుతాడు, అది సాధించ లేని వాడు ఏదీ సాధించేలేడు. అటువంటి వాళ్లు మాట్లాడే మాటలు వట్టి ప్రగల్భాలే, కాబట్టి ఏదైనా సాధించేముందే. సాధించుతాము అనే ముందూ ఆహారనియములు పాటించగలమా లేదాని పరీక్ష చేసుకుంటే చాలు—ఫలము ఎట్లా వుంటుందో తెలుస్తుంది.

అయినా మనిషై పుట్టి పశు పక్షాదుల కన్నా అవివేకంగా ప్రవర్తిస్తే దాని అర్థమేమి తిరుమలేశ? అసలు ఆ మాటకొస్తే అన్ని విధాల మనము పశు పక్షాదుల కన్నా అన్ని విధాల హీనమైన జీవనము గడుపుతూనే చాలా తెలివిగల వాళ్లమని విర్రవీగుచున్నాము. మానవుడు బైట ప్రకృతినంతా జయించితే మాత్రము ఏమి లాభము తన స్వంత దేహాన్ని జయించలేనిది?

క్షేత్ర క్షేత్రజ్ఞ మీమాంసల సారాంశము ఇంతేనంటాడు వేదాంతి. తిరగ వెయ్యండి మీ భగవద్గీత.

★

కొత్త పుస్తకాలు

భీమేశ్వర పురాణము.

శ్రీనాథుడు.

పీఠిక : చిలుకూరి పాపయ్యశాస్త్రి.

ప్రాప్తిస్థానము : అద్దేపల్లి అండుకో.
సరస్వతీ పవర్ ప్రెస్.
రాజమహేంద్రవరము.

మూల్యం : 6రూ॥

ప్రాచీన కావ్యాలు కూడా పఠించడం ప్రతి అక్షరాస్యుడికీ విధి. వాటిని అందుబాటులో ఉండేటట్లు అచ్చువేసి అమ్మడం అభిరుచి గల ప్రకాశకుల ధర్మం. ఈనాడు ఆంధ్ర కావ్యాలలో ముఖ్యమైనవే కొనుక్కుందామన్నా కూడా దొరకడంలేదు. గ్రంథాలయాలలో జాబితాల్లో తప్పించి, బీరువాలలో కొన్ని కనబడడంలేదు. మంచి సాహిత్యాన్ని, అందులోకి ప్రాచీన కవిత్వాన్ని,ప్రచురించే ప్రకాశకుల్ని ఆంధ్ర దేశంలో వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. వీళ్ళు కూడా పూర్వం తాము అచ్చువేసిన, ప్రస్తుతం ప్రతులేని,కావ్యాలను మళ్ళా అచ్చు వేయడమేలేదు.

ఇలాంటి పరిస్థితులలో శ్రీనాథుడి భీమేశ్వర పురాణం ప్రచురితమైనదంటే ప్రతి ఒక్కడూ హర్షిస్తాడు. పైపెచ్చు పాఠభేదాలు సరిచూశాక ప్రచురించిన దంటే మరీని. ఈ మంచిపని చేసిన "అద్దేపల్లి అండుకో" వారిని మొట్ట మొదట ప్రశంసించాలి.

ప్రాచీన కావ్యాలు పరిష్కరించి ప్రకటించడం చాలా కష్టమైనపనే కాక కత్తిమీదసాము లాంటిది. పరిష్కర్త తన ఇష్టాయిష్టాలచొప్పున కాక ఔచిత్యాన్ని బట్టి పాఠనిర్ణయం చేయాలి. అద్దేపల్లివారు వేసిన భీమేశ్వర పురాణాన్ని శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గారు పరిష్కరించారు. విపులమైన పీఠిక రాశారు.

ఈ సుదీర్ఘమైన పీఠికవల్ల శాస్త్రిగారు చాలా కృషి చేసినట్టు కనబడుతోంది. భీమఖండంలో శ్రీనాథుడు వర్ణించిన ప్రతి క్షేత్రం దర్శించి దాని పూర్వ గాథని ప్రస్తుత స్థితినీ తెలుసుకోడానికి శ్రమించారు. స్థలపురాణాలు సేకరించారు. శ్రీనాథుడు పేర్కొన్న స్థలాలు కొన్ని యిప్పుడు కనబడకపోతే అది ఏ ప్రదేశాంలో ఏ పేరున ఉండవచ్చో వివరించారు. ఉదాహరణకి రుద్రపాదాలనే వాటిని శ్రీనాథుడు పేర్కొన్నాడు. వీటిని గుర్తించడంలో శాస్త్రిగారి పరిశోధనా శక్తేకాక దీక్షకూడా కనబడుతుంది. "పాదాః ప్రత్యంత పర్వతాః" అనే అమరకోశ శ్లోకం, ఆధారంగాచేసుకొని సముచితంగా గుర్తించారు.

"శ్రీనాథుడు వాడిన విశేషణము లన్నియు సార్థముకలే యగుగాని నిరర్థకము లేమియుగానరావని" శాస్త్రిగారు ఊహించారు. ఇది నిజమే ఏ మహాకవీ అబద్ధం ఆడలేదు. శ్రీనాథుడు లాంటి మహాకవుల గ్రంథాలు కొన్ని లేకపోతే ప్రాచీనాంధ్ర చరిత్ర గుడ్డిలో మెల్లగా దొరికినంతైనా దొరకక్క పోవును.

శ్రీనాథుడి జీవితం గురించి బాగా చదువుకున్న వాళ్ళలోనే అభిప్రాయ భేదాలున్నాయి. కొందరు శ్రీనాథుడు మహా భక్తుడంటే, మరి కొందరు పచ్చి శృంగార పురుషుడంటారు. కొందరు శ్రీనాథుడికి సీస పద్యాలు రాయడం రాదంటారట కూడా! శ్రీనాథుడు తెలుగువాడేకాడు, కర్ణాటక దేశస్థుడని నిర్ధారణ చేశారో విద్యాశేఖరులు. మొత్తానికి శ్రీనాథుడి విషయంలో అభిప్రాయ భేదాలుండక తప్పదనిపిస్తోంది.

శ్రీ పాపయ్యశాస్త్రి గారికి శ్రీనాథుడంటే భక్తి శ్రద్ధా రెండూ ఉన్నాయి. అయినా వీరు కూడా వివాదాస్పదమైన విషయాలు రాశారు. అందులో ముఖ్యమైనది, శ్రీనాథుడు భీమఖండాన్ని ముందే అయిదాశ్వాసాల ప్రబంధంగా రాసిపెట్టుకున్నాడనేది, ఈ ఉద్దేశంతో నేను ఏకీభవించలేను. శ్రీ శాస్త్రిగారు ఇలా నిర్ణయించడానికి కారణం లేకపోలేదు. "ఈ ప్రబంధము నందు ద్వివిధమయిన యుపక్రమము గానవచ్చుచున్నది" అందుచేత శాస్త్రిగారు "దీనినిబట్టి శ్రీనాథుడు భీమేశ్వర పురాణమును నాంధ్రభాషామయ కావ్యముగ నంతకు ముందే సేకరించి, అయిదాశ్వాసముల ప్రబంధముగ, గూర్చిపెట్టి యున్నాడు. ఆవెనుక రాజమహేంద్రవర రెడ్డి ప్రభువుల యాస్థానంలో స్థానము నార్జించుటకై కావ్యాది గద్యపద్యములను, ప్రథమాశ్వాస విషయమును దానికతికించి యున్నాడు. దీనితో వొలుతటి ప్రబంధ మయిదాశ్వాసములే యయినను, నాఱాశ్వాసముల ప్రబంధమయినది" అని ఊహించారు.

స్థూలంగాచూస్తే ఇది సబబే అనిపిస్తుంది గాని శ్రీనాథుడి కావ్యాలలో కృత్యాది పద్యాలను యింకొక మారు పరిశీలిస్తే ఇది బే-సబబు అనిపించక తప్పదు. శాస్త్రిగారు చెప్పినట్టు "శ్రీనాథుడి విశేషణాలు నిరర్థకాలు కావు." అలాగే శ్రీనాథుడి కృత్యాది వచనాలూ అసత్యాలు కావు. ఏదైనా ప్రబంధం తానంతకు ముందే రాసిపెట్టుకొంటే ఆసంగతి చెప్పగల ధైర్యం శ్రీనాథుడికుంది. కాశీఖండ పీఠికలో "చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడు..." పద్యంలో "ప్రాయ మెంతయు మిగులఁగైగ్రాలకుండఁ గాశికాఖండమను మహాగ్రంథమేను దెనుగు జేసెద" అని చెప్పుకున్నాడు. ఆ తరవాత "ఇమ్మహా ప్రబంధ ప్రారంభంబు గర్ణాకర్ణికావశంబున నాకర్ణించి.. " భూపాలుడు పిలిపించి... అంకితం ఇమ్మన్నాడు. అనిరాశాడు.

"ఇప్పుడు చెప్పదొడంగిన యీ ప్రబంధ మంకితము చేయు వీరభద్రయ్యపేర" అని రాజు మాటలుగా కాశీఖండంలో రాసుకున్న శ్రీనాథుడు, భీమఖండం పీఠికలో బెండపూడి అన్నమంత్రి "శ్రీగోదావరీ ఖండమున్ బరిపాటి రచియింపు మంధ్రజగతీ భాషా ప్రబంధంబుగన్" అని సెలవియ్యగానే "ఇంతకుముందే రాశాను" అని చెప్పడా?

లేక, శ్రీనాథుడంతకు ముందే రాసుంటే కర్ణాకర్ణిగా అన్నమంత్రికి తెలియకుండా ఉంటుందా? తెలిసినా అన్నమంత్రి తెలియనట్టు నటించాడా?

శ్రీనాథుడులాంటి మహాకవులు ఎంత'లోకజ్ఞు'లైనా ఉన్నదున్నట్టు రాసుకుంటారు. నైషధం లోకూడా ఏ పుస్తకం కావాలో సింగనామాత్యుడే చెప్పి "సబహుమానంబుగ గర్పూరతాంబూలం బొసంగి జాంబూనదాంబరాభరణంబులుగట్టనిచ్చి వీడ్కొలిపిన నేను సమ్మహా ప్రధానునిం గృతినాయకుంజేసి నైషధ కావ్యంబు చెప్ప దొడంగితి" అని రాసుకున్నాడు.

"హరవిలాసం"లో తిప్పశెట్టి కూడా "శైవ ప్రబంధమొకటి, యవధరింపుము నాపేర నంకితముగ "అని అడిగాక" 'శుభముహూర్తమున' "హరవిలాసంబను ప్రబంధం పెప్పదొడంగి..." అని శ్రీనాథుడు రాసుకున్నాడు.

భీమఖండానికి ముందు రాసిన వాటిలో, తరవాత రాసిన వాటిలో ఇలా సాక్ష్యాలు దొరుకుతూ ఉండడంచేత, భీమఖండంలో అన్నమంత్రి సబహుమానంబుగా గర్పూరతాంబూల జాంబూనదాంబరాభరణంబు లొసంగి వీడుకొలిపిన్...యాంధ్రభాషా ప్రబంధముగ జెప్పం దొడంగితి" అనే వాక్యాలు లాంఛనానికిరాసినవేగాని, నిజంకాదు అని ఎలా అనుకోడం?

కాశీఖండానికి పూర్వం శ్రీనాథుడు ఎవరైనా తాంబూలం ఇస్తేనేగాని కృతిమొదలు పెట్టలేద

నే అనుకోవాలి. కాశీఖండం నాటికి వయస్సు ముదిరింది కనుక "ప్రాయమెంతయు మిగులగ్రై వాలకుండ" తనంతటతానే రచనకి ఉపక్రమించాడు. శ్రీనాధుడంతటివాడు కొత్త కృతిమొదలెడితే ఆవార్తపైకి పొక్కకుండా ఉంటుందా. కర్ణాకర్ణి విని అంకితం ఇమ్మనే వాళ్ళు ఉండనే ఉంటారు.

కాబట్టి శ్రీనాధుడు ఎప్పుడో రాసి పెట్టుకొన్నది అన్నమంత్రికి అంకితం ఇచ్చాడన్నది బేసబువు. అదీకాక శ్రీ పాపయ్య శాస్త్రిగారు చెప్పినట్టు "నిరర్థకంగాని విశేషాలతో" గోదావరీఖండాన్ని వర్ణించాలంటే ఆ ప్రాంతాలన్నీ శ్రీనాథుడు తీరుబాటుగా పర్యటించి ఉండాలి. అన్నమంత్రిని ఆశ్రయించడానికి ముందే శ్రీనాధుడికింత తీరుబాటూ సౌకర్యాలూ దొరికాయా? సందేహించదగ్గ అంశం.

శ్రీపాపయ్య శాస్త్రిగారు శ్రీనాధుడిని ఏకారణంచేతనో ఆశ్రయం కోసం లౌక్యం ప్రయోగించేవాడిగానే చూడగలిగారు. "శ్రీనాధుడొకయాస్థానంలో స్థానము నార్జింప వలయుననిం దత్సంబద్ధులతో గృతి సంబంధము నేర్పరుచుకొనుట యొకపరిపాటి యయినది" అన్నారు. ఇది శ్రీనాధుడి హుందాతనానికే మచ్చ. అడిగించుకొని అంకితం ఇచ్చే రకమేగాని ఆశ్రయం కోసం అమ్ముకొనే స్వభావం శ్రీనాధుడిలో ఉండదు.

ఇలా కొన్ని అభిప్రాయ భేదాలకి ఆస్కారమున్నా శ్రీ శాస్త్రిగారి పీఠిక ప్రతిభావంతంగా ఉంది. పాఠాలు నిర్ణయించడంలో ప్రజ్ఞ కనబడుతూంది. ముఖ్యంగా ఔచిత్యానికి వీరిచ్చిన ప్రాముఖ్యం మెచ్చుకోతగింది. కొన్ని కొన్ని పాఠ భేదాలు చూపించి ఈ పాఠాన్నే తామెందుకు ఎంచుకొన్నారో వివరించారు. అర్థం విషయంలోనే శాస్త్రిగారు శ్రద్ధ కనబర్చారుగాని పద్యంలోని "సంగీతానికి" ప్రాముఖ్యం యివ్వలేదనుకోవలసి వస్తోంది. ఉదాహరణకి ద్వితీయాశ్వాసంలోని ఒకపద్యంలో "కాలకూటవిషాగ్ని కబళహేలాగ్రాస కల్మష కంఠోప కంఠుచేత" అనే పాదంలో 'కల్మష' అనే పదానికి బదులు 'కల్మాష' అనే పదం ఉంటే శ్రావ్యంగా ఉంటుంది. పూర్వముద్రణలో "కల్మాష కంఠోప కంఠుచేత" అనే పాఠమే ఉందని విన్నాను.

ఇకపోతే ముద్రణ అందంగా ఉందిగాని అచ్చుతప్పులు కొల్లలు. పద్యకావ్యం అచ్చువేసేటప్పుడు తీసుకోవలసిన శ్రద్ధ ప్రకాశకులు, తీసుకోలేదని పిస్తోంది. ఉదాహరణకు, వేరే ఉదాహరణమెందుకు? పైన ఉదహరించిన పద్యంలోనే రెండవ పాదంలోనే గణభంగం యతిభంగం అచ్చయింది. తప్పొప్పుల పట్టిక ప్రశక్తే లేదు. పైగా ఈ పట్టికలో యిచ్చినకొన్ని తప్పులుగాని? ఒప్పులుగాని గ్రంథంలో కనబడవు. ఉదాహరణకు తృతీయాశ్వాసం 119వ పద్యంలో తప్పుందీ దిద్దుకోమన్నారు అక్కడ అటువంటిదేంలేదు. ద్వితీయాశ్వాసం లోని 45 వ పద్యంలోని ప్రథమపాదంలో తప్ప పట్టికలోకి ఎక్కలేదు.

అసలు శ్రీ శాస్త్రిగారి పీఠికకు తప్పొప్పుల పట్టికేలేదు. 95 వ పేజీలో ఉదహరించిన కంద పద్యంలో ప్రాస తప్పడం, గణభంగం, గుర్తించనే లేదు ముద్రాపకులు. నాలుగు కాలాలపాటు పండితులూ, విద్యార్థులూ వాడుకొనే ఇలాంటి ముద్రణాలలో ఈ తప్పులుండకూడదు. ఇక ముందు ప్రచురించే వాటిలో యిలాంటి లోపాలు రాకుండ ప్రచురణ కర్తలు శ్రద్ధతీసుకుంటారని ఆశిస్తాను.

మొత్తానికి ఒక మంచి ప్రబంధాన్ని చక్కని రూపంలో ఆంధ్ర దేశానికి అర్పించినందుకు, శ్రీ శాస్త్రిగారిని అద్దేపల్లి అండుకో వారిని అభినందించాలి.

—ఆరుద్ర.

మార్కండేయ విజయము.

శ్రీ పైడి లక్ష్మయ్య.

శ్రీశైల దేవాలయ ప్రచురణము.

వెల : 2. రూ.

కవి చిన్ననాట రచించిన మార్కండేయ మను శైవ నాటకము ప్రజా సామాన్యమునకు సుబోధకమగు శైలిలోవున్నది. పాఠశాలలందు దేవళములందు, పల్లెటూళ్ళలో, తిరునాళ్ళల్లో, సులభముగా ప్రదర్శించుటకు అనుకూలమై వున్నది. భక్తిరస పూరితమైన ఈగాథ పండిత పామరులకును సమానముగా రంజింప గలదు. శ్రీశైల దేవస్థాన జీర్ణోద్ధరణ కార్యక్రమములో ఈ నాటకము పునర్ముద్రణము చేయుట, ముదావహము. కవి ఆశించిన ప్రకారము ఈ నాటకము రసికరసజ్ఞుల, శివభక్త, కళాకారుల అభిమాన పాత్రమై శ్రీశైల దేవస్థాన జీర్ణోద్ధరణకు సహాయపడుగాక.

కె. ఎల్. ఆర్.

వ్యావహారిం భాషావ్యాకరణం.

శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్య.

ప్రచురణ : అద్దేపల్లి అండుకో.
సరస్వతి పవర్ ప్రెస్.
రాజమహేంద్రవరం.

మూల్యం : రూ 4. 50 న. పై

వ్యావహారిక భాషను ప్రజలమధ్య నిలపడానికి పాటుపడ్డారు - అతిరథ మహారథులవంటి గిడుగు, గురజాడ, మొదలైనవారు. ఇప్పటికీ గ్రాంధికాన్ని తప్ప యింకోభాష - జీవభాష - భాషకాదని వాదించే ఘనులుండనే వున్నారు. వీరి-మతం వేరు. వీరిభాష వేరు. మనం చెప్పేది అందరికీ అందుబాటులో వుందా లేదా? లేకుంటే దీని ప్రయోజనం ఏమిటి, అన్నబాధ కాని; మీమాంస కాని వీరికిలేదు. తాము పట్టిన కుందేటి సామెత వంటి తత్వంగల వీరిని, వీరి అభిమాన భాషా సూత్రాలనీ పక్కకినెట్టి వ్యావహారిక భాష గ్రంథస్థం అవుతూనే వుంది. ఈ భాషా బల నిదర్శనమే యీ వ్యావహారిక భాషా వ్యాకరణం - అనే గ్రంధరచన. భాషా స్రవంతి మహోధృతంగా ప్రవహించి పోతున్నప్పుడు దాన్ని అరికట్టడం ఎవరితరం కాక పోయినా, ఏ మహానదికైన ప్రోజెక్టువంటి దేలా నిర్మాణ సాధ్యమో అలాగే ఏ జీవభాషకేనా వ్యాకరణ సృష్టి కొంత సాధ్యమే అన్న నిరూపణమే యీ పుస్తక రచన. విమర్శనా దృష్టితో అందరు చదువతగ్గ పుస్తకం.

* * *

శ్రీ వెంకటేశ్వర శతకము.

శ్రీమతి ఎన్. యామినీపూర్ణతిలకమ్మ.

ప్రాప్తిస్థానం : విశ్వకళ్యాణ విజ్ఞాన విహార్.
ముడుచూర్ రోడ్డు; తాంబరం
మద్రాసు.

మూల్యం : అమూల్యము.

ఆంధ్ర దేశంలో స్త్రీజన పురోభివృద్ధి, వికాసాన్ని గురించి మాట్లాడేటప్పుడు శ్రీమతి యామినీ పూర్ణతిలకమ్మ గారిపేరు చెప్పక తప్పదు. సాంఘిక రాజకీయ రంగములలో యీమె కడు ఉత్సాహంతో పాల్గొన్నారు. హృదయంలో అణిగి మణిగి వున్న కవితా స్రవంతి ఎప్పుడో ఒకప్పుడు పెల్లుబుకుతుంది. అటువంటి భక్తిపారవశ్య ఫలితమే యీ వేంకటేశ్వర శతకము. తన యిలవేల్పు శ్రీవెంకటేశునితో తన గోడునంతా వెళ్ళబోసు కుంటూ మాట్లాడినట్టుగా యీ శతకం అంతా నడిచింది. చదువరుల కెంతో ఉత్సాహదాయకంగావున్న యీ శతకం అందరూ చదువతగ్గది.

కె. ఆర్.



లక్నోలోని స్టేట్ మ్యూజియం

1863 లో మునిసిపల్ సంస్థగా నెలకొల్పబడిన లక్నో స్టేట్ మ్యూజియమ్ ప్రస్తుతం ఎనలేని ప్రాచీన వస్తుసముదాయానికి ఆటపట్టుగా రూపొందింది.

బలి-విష్ణువుల గాధ అందరికీ తెలిసినదే. పై చిత్రంలో విష్ణు భగవానుడు బలిని కలుసుకోవడం చిత్రితం అయింది. "హరివంశ పురాణ" అనే పర్షియను అముద్రిత గ్రంథంలో పదహారవ శతాబ్దికి చెందిన అమూల్యమైన ఆరు చిత్రాలు వున్నాయి. అందులో ఒకటి యీ బలి విష్ణువుల చిత్రం.

సాంఘిక ఆచారాలు

బర్మీయుల వివాహము

మూలం : రేబాలూయిస్.

అనువాదం . మంత్రవాది కామేశ్వరి.

బర్మీయుల సామెత ఒకటుంది. రుషులూ మునీశ్వరులూ సన్నగా వుంటే అందం, చతుష్పాదులు బలిసి వుంటే అందం, మగవారు విజ్ఞానులైతే అందం, స్త్రీలు వివాహం చేసుకుంటే అందం" అని. నిజంగానే బర్మాస్త్రీలు వైవాహితులైనప్పుడురాణిస్తారు. వారు సాంఘిక ఆర్థిక రంగాలలో స్వాతంత్ర్యం కలవారు. దానిమూలాన్నే పశ్చిమ ఆశియా మొత్తంమీదే వారి స్థానం ప్రత్యేకత వహించి వుంది.

బర్మాయువతి వివాహం చేసుకున్న సందర్భంలో తనపేరు మార్చుకోనవసరం లేదు. ఆమె డాక్టరుగారు లాయరుగాని అయితే వివాహంతో అవృత్తులకి స్వస్తి చెప్పి వంటగదికి అంకితం అయిపోనక్కరలేదు. భర్త ఏదైనా వ్యాపారంలో వుంటే, వివాహంతో పాటే యామె భాగస్వామి అవుతుంది. ఆ వ్యాపారంలో. ఇది ఎంత సంప్రదాయ సిద్ధం అయిందంటే బౌద్ధధర్మ సూత్రాల ఆధారంతోకూడా వివాహోవంతరం భార్య సంపాదనకు రక్షణలు బర్మీయులుకల్పించు కున్నారు. వైవాహిక జీవితంలో సంతోషంలేక ఏ స్త్రీ అయిన విడాకులు పుచ్చుకోవాలంటే — అది సులభ సాధ్యం. దానివల్ల సాంఘికంగా చిన్న చూపు చూడబడే అవకాశం కూడాలేదు. బౌద్ధమతావలంబకులైన భార్యాభర్తలు తమ వివాహాన్ని రద్దు పరచుకో వాలంటే అలాగే చేయొచ్చు. భర్తవిహీన అయిన పక్షంలో భర్త ఆస్థిపాస్తులలో ఎక్కువభాగం భార్యకి వస్తుంది. భర్త మరణానంతరం వివాహం చేసుకోదలిస్తే అందుకు బర్మా యువతికి సాంఘికమైన అడ్డు లేవు.

న్యాయశాస్త్ర రీత్యానూ, ప్రాచీన సంప్రదాయాల ప్రకారముకూడ బర్మాస్త్రీలు వారి విధికివారే కర్తలుగా రూపొందాల్చారు. అయితేనేం? "స్వప్నవాసుల ఆడపిల్లలు" అని పిలువబడే వీరు జీవితాంతం భర్తే గృహాధిపతి, తమ జీవితాధికారి అన్న భ్రమతోనే గడుపుతారు. కాని, నిత్య జీవితంలో ఏ ముఖ్యమైన తీర్పు అయినా చేసేది స్త్రీలే! అందుకే. పగలు, గౌరవ పురస్సరంగా భర్త వెనక నాలుగడుగులు దూరంగా నడిచినా, రాత్రివేళ ఏదైన ప్రమాదం సంభవించే సూచనలు కానవస్తే దీపం చేతబూనితానే ముందు నడచి దారి చూపుతుంది బర్మావనిత.

బర్మీయుల వివాహకాండ కూడా భవిష్యత్తులో భార్యాభర్తల మధ్యనుండే బాంధ్యవ్యాన్ని కూడ సూచిస్తుంది. ప్రేమించి, గౌరవించి అణగి మణగి నమ్రతతో వుంటానని వధువు ప్రమాణం చేయదు! అలాగే — నీ సంరక్షణ భారం, బాధ్యత పూర్తిగా నేను వహిస్తానని వరుడూ ప్రమాణం చేయడు.

వీరి వివాహ క్రతువు శాస్త్రయుక్తమైనదే అయినా మతవిషయిక క్రతువులతో కూడినది కాదు. బౌద్ధ మతాన్ని స్వీకరించిన వీరి గురువులు ప్రపంచ సుఖాన్ని త్యజించిన వారవడం చేత యిటువంటి కర్మకాండలలో పాల్గొనరు; కాని వివాహకాండకి దర్జా నివ్వడం కోసం, పూర్వంలో వచ్చిన మణిపూరీ బ్రాహ్మణ సంతతికి చెందిన పురోహితులు సంస్కృత తంతోనూ పాళీలోను సుదీర్ఘమైన గేయాలు చదువుతారు. ఈ రోజులలో, కమ్యూనిటీలోని పెద్దఎవరైనా వివాహమంటపంలో పెద్దరికం వహించడం. నాగరికతగా అవుతూంది. ఉత్ప్రేక్షలతో కూడిన భాషతో యీ పెద్ద వధువు తరపు తాత ముత్తాతల ఘనతని చాటి చెప్తాడు. వరుని తాత ముత్తాతలని వర్ణించు తరువాత వధూవరుల గుణగణాలు వర్ణిస్తాడు. యీ పెద్ద యిలా చెప్పుకు పోతూవుంటే అక్కడ గుమిగూడిన వాళ్ళంతా వధువును తిలకిస్తూ, హాయిగా కేరింతాలు కొడుతూ కబుర్లు చెప్పుకుంటూ వుంటారు

బర్మీయుల వధువు కళ్ళు మిరుమిట్లు కొల్పేలా వుంటుంది. నాజూకుగా అందంగా సౌకుమార్య దేవతగా కనిస్తుంది. చక్కని రంగుల పొందిక కల్గిన,



దుస్తులతో చూపరులని యిట్టే అరికట్టేస్తుంది. ఆ వధువు పట్నవాసి కానివ్వండి. పల్లెప్రాంతపు వనిత కానివ్వండి. పల్లెటూరిదైతే చక్కని పట్టు లుంగీ జాకెట్టు ధరించి పువ్వులొక్కటే తన ఆభరణంగా ధరించి మన దృష్టిని ఆకట్టుతుంది. పట్నవాసి అయితే ముత్యాలతో కుట్టిన లుంగీ ధరించి చక్కని నైలాన్ జాకెట్టు తొడిగి మన మెప్పు అందుకుంటుంది. అందరు బర్మా యువతులు తమ కేశాలను చక్కగా అలంకరించుకుంటారు. శిరోభాగానికి జుట్టు నంతా చేర్చి చిన్న పేము బుట్టమీద చక్కగా యీ జుట్టుని పేర్చి. మిగిలిన జుట్టుని ఒక బుజంమీద నుండి క్రిందికి వదులుతారు. చూడడానికి ఎంతో చక్కగా వుంటుంది యిది.

సాధారణంగా వధువు వరుని ప్రత్యేకతని కనుమరుగు చేసేస్తుంది. బహుశా నిత్య జీవితంలో కూడా యింతే. ఎందుకంటే సాధారణంకా బర్మాలో పురుషుల కంటె స్త్రీలే ఎక్కువగా రాణిస్తారు. వరుని [illegible]

సిద్ధం అయిన గులాబి రంగు సిల్కు లుంగీ ధరించి దానిమీద తెల్లని సిల్కు జాకెట్టు ధరిస్తాడు. తలపై దాల్చేది కూడా గులాబి రంగుదే అయి వుంటుంది.

చిన్న మంటపంలో గాని, చక్కని తివాసి పరిచిన స్థలంలో కాని వధువూ వరుడు పక్క పక్కగా కూర్చుంటారు, వారి వారి బంధువు లందరూ కూడా కూర్చుంటారు సాధారణంగ వరుడు కుడిప్రక్క వధువు ఎడమప్రక్క కూర్చుంటారు. వివాహానికి పెద్దరికం వహించిన పెద్దమనిషి చెప్పే వాక్యాలని అతిభక్తి శ్రద్ధలతో వింటారు వీరు. అంతా చెప్పడం అయ్యాక, వధూవరుల చేతికి థాచ ఆకుల గుత్తులని యిస్తాడు పెళ్లిపెద్ద, అది చేత పుచ్చుకొని గౌరవ పురస్సరంగా వంగుతారు. యిద్దరూ. మొదటి గౌరవం బుద్ధునికి తరువాత ఆ ఆకులని పెద్ద వెండి కుండలో పెడతారు. యిలాగే ఆరుసార్లు జరుగుతుంది— రెండవ సారి— బుద్ధ సూత్రాల గౌరవార్థం, మూడవ సారి మత గురువుల గౌరవార్థం, నాల్గవ సారి తల్లిదండ్రుల గౌరవార్థం, ఐదవసారి అందరి పెద్దల గౌరవార్థం, ఆరవ సారి విందుకు వేంచేసిన వారి గౌరవార్థం వంగి నమస్కరిస్తారు.

తరువాత అనేక సంవత్సరాల క్రితం పెళ్లయి, వైవాహిక జీవితంలో సంతోషంగావున్నారన్న వృద్ధ దంపతులు వధూ వరుల చేతులు నీటితో నిండిన బంగారు గిన్నెలో ముంచుతారు. లేకుంటే యిద్దరికీ ఒకే పాత్ర నుండి పానీయం అందింపుతారు. దానితో వారి వివాహం పూర్తి అయినట్టు, కాని దీన్ని అధికార యుతంగా చేయడానికి గాను, పెళ్లి పెద్ద గట్టిగా "అంగ్ బీ" అంటూ మూడు సార్లు అంటాడు. అంటే- వివాహం పూర్తి అయింది! అని అర్థం- ఇది కాగానే అక్కడ చేరిన అథితులందరూ వధూ వరుల మీద అక్షింతలూ, కొత్త నాణేలూ వెదజల్లుతారు.

ఈ కాండ అయిన తరువాత వధువును చక్కగా అలంకరింపబడిన గదిలోకి తీసుకువెళతారు. వరుడు రాకుండా స్నేహితులందరూ దారిఅడ్డు కాస్తారు, ప్రాణంవిసిగి అక్కడచేరి అడ్డగించిన అందరికీతృణమో పణమో లాంఛన ప్రాయంగా పంచియిస్తాడు పెళ్లి కొడుకు. దాన్నే "రాయడబ్బు" అంటారట. పూర్వంలో పెళ్లికొడుకుయిలాలంచంయివ్వకపోతే, అతని స్నేహితులంతా కలసి అతని యింటిపై రాళ్లు రువ్వేవారట. స్నేహితులని తృప్తిపరచి తనకై వేచియున్న నవవధువు చెంతకుపోతాడు పెళ్లి కొడుకు. (యుఎనెస్కో)

దిట్టకవి

వేములవాడ భీమకవి

కె. శారద బి. ఏ.

ఆంధ్ర సాహిత్య రంగంలో అగ్రశేణికి చెందిన అనేక కవిశిఖామణులున్నారు. కాని అనంతమగు కాల ప్రవాహములో మనము వారిని విస్మరించుచున్నాము. మరుగు పడిన మాణిక్యములానున్న కవి వేములవాడ భీమకవి.

భీమన విమలాదిత్యుని కాలము వాడని తెలియుచున్నది. విమలాదిత్యుడు రాజ రాజ నరేంద్రుని తండ్రి:- భీమనయే తాను విమలాదిత్యుని కాలమువాడని పేర్కొన్నాడు.

మ : ఘనుడన్ వేములవాడ వంశజుడ ద్రాక్షారామ భీమేశ
దనుజన్ దివ్య విషామృత ప్రకట నానాకార్య ధుర్యండ భీ
మన నాపేరు వినంగ జెప్పితి వెలుంగాధీశ-

అనుటచే ఈ నామము విమలాధీశునిని పర్యాయ పదముని కొందరనిరి. శ్రీనాధ కవికూడ తన కవిస్తుతిలో ముందు భీమనను పేర్కొని తరువాత నన్నయను పేర్కొన్నాడు-

సీ : వచియించు వేములవాడ భీమనభంగి నుద్దండలీల లొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున నుభయ వాచక్రౌఢి నొక్కొక్కమాటు

ఇట్లు శ్రీనాధుడుకూడ భీమ కవికే యగ్రతాంబూల మొసగెను. భీమకవి వేములవాడలో జన్మించెను. కొందరిది కృష్ణా మండలములోనిదనియు మరికొందరిది గోదావరీ మండలములోనిదనియు అందురు. ఇది ఎట్లున్ననూ భీమకవి జన్మను గురించి యొక విచిత్ర వృత్తాంతము కలదు. భీమన తల్లి యొక బాల వితంతువు. తోడివారలతో శివరాత్రి నాడు ఈమె ద్రాక్షారామ భీమేశ్వర దర్శనమునకరిగెను. తోడివారందరునూ పుత్రులనిమ్మని యా శిలావిగ్రహమును ప్రార్థించుచుండిరి. అంతట యామె శిల యచటైన కోర్కెలను దీర్చునాయని సందేహముతో పరిహాసముగ తనకునూ పుత్రుడుదయించిన "పెట్టెడు నీరు దీపారాధన చేసి నాలుగుపుట్ల యిసుక నైవేద్యము చేసెదనని" మ్రొక్కెను. పరమేశ్వరుడీమె పరిహాసమునకు వెరగొంది ఆమె పరిహాసమును నిజము చేయదలచి విశేష తేజశ్శాలి యగు పుత్రుడుదయించునని కలలో వరమిచ్చి యంతర్హితుడయ్యెను.

ఇట్లు జన్మించిన భీమకవి క్రమముగ శైశవము గడపి బాల్యమున ఆడలాడుచుండ తోడి బాలురు తండ్రిలేనివాడని పరిహసింప భీమన తన తండ్రి యెక్కడ యని తల్లి నడిగెను. భీమేశ్వరుడే నీ తండ్రియనియూ అతడే నిన్నీ యపవాదునుండి రక్షించునని చెప్పెను. అట్టి భీమన భీమేశ్వరుని ప్రార్థించి తానాడినది యాటయు పాడినది పద్యము కావలెనని వరమందెను.

భీమన కవితా చమత్కృతిని తెల్పు యనేక ఘట్టములు మృదులములైకి స్పష్టమగుచున్నవి. భీమన యొకనాడు గ్రామాంతరమున కరిగి గుఱ్ఱమునొక చోట గట్టెను. అది కనుమరగి పోయెను. అంతట భీమకవి తన గుఱ్ఱము శ్రీపతి పోతరాజను సామంతునిచే అపహరింపబడెనని తెలుసుకొని, గుఱ్ఱమును తిరిగ యిమ్మని వ్రాసి పంపినను ఆ రాజు వినకుండుటచే ఇట్లు పద్యమును వ్రాసి పంపెను.

చ : హయమది సీత, పోతవసుధాధిపు, డారయ రావణుండు; ని
శ్చయముగ నేను రాఘవడ; జాహ్నవి వారిధి; మారు డంజనా
ప్రియ తనయుండు; సింగన విభీషణు; డా గుడిమెట్టు లంక, నా
జయమును పోత రక్కసుని చావును నేడవనాడు చూడుడీ,

అంత ఆరాజు మృతినొంద, సహగమనము చేయబోవుచున్న యారాజపత్నులు భీమనకు నమస్కరింపగా సుమంగళులు కమ్మని దీవించి మరల నిట్లు పద్యము చెప్పి రాజును బ్రతికించెను :- "నాటి రఘురాముని తమ్ముడు, పాటిగ సంజీవి చేత బ్రతికిన భంగిన్ గాటికి బోనీకేటికి, లేటవరపు పోతరాజ లెమ్మా రమ్మా"

భీమకవి రాజ రాజ నరేంద్రుని వంశమువాడగు నొక్క నృపాలుని యాస్థానమున నున్నట్లు తెలియుచున్నది. ఒక నాడా రాజసభలోనివారు భీమకవి వరమును మార్చి

(ఆడినది ఆటయు పాడినది పద్యము) రూఢి చేయమని పల్క యతడు యొక్క పద్యమును చెప్పి సభా మంటపము లోని స్తంభమును వృక్షముగా మార్చి.

శా: ఆనీతాభ్యుపదాను స్సృంఖళ కరాభ్యాలంబిత స్తంభమా!
నేనే వేములవాడ భీమకవి నేనిన్ జిత్ర కూటంబులన్
ఘూన వ్యాపృత పల్లవోపలతికా పుష్పోప గుచ్ఛంబులన్
నానాపుష్ప ఫలప్రదాయ వగుమా నాకల్ప వృక్షాకృతిన్ ॥

అని నుడివి తిరిగి ఈ క్రింది పద్యముతో ఆ వృక్షమును స్తంభముగా మార్చెను.

ఉ:- శంభు వరప్రసాది కవిజాల వరేణ్యుడ నైన నావచో
గుంభన మాలకించి యనుకూలత నొంది తనూన భావనన్
గుంభిని తొక్కనాము నృప కుంజరు పందిరి మల్లె పాలగున్
స్తంభము రీతి నీతనువు దాలిచి యెప్పటి యట్ల యుండుమా

ఈ పై పద్యంబులు రెండునూ భీమకవి రచనా వైచిత్రిని తెల్పుచున్నవి. మరియు భీమకవి శాపములనిడుటయందునూ వాటిని మరల్చుటయందునూ సమర్థుడు. ఇతడు తనను నిరాదరించిన రాజా కళింగ గంగును జోగిని చేసెను. ముప్పది రెండు దినంబులావలన్ ఝామున కర్థమందతని సంపద శత్రుల పాలు కావుతన్" ఇట్లు జోగిని చేసిన రాజును తిరిగి తానాదేశము వచ్చినప్పుడు క్రింది పద్యము చదివి యాతని శాపము మరల్చెను.

ఉ:- రాము నమోఘ బాణమును రాజశిఖామణి కంటి మంటయున్
దామరచూలి వ్రాతయును దారక విద్విష ఘోర శక్తియున్
భీమగదా విజృంభణ ముపేంద్రుని వజ్రము చక్రి చక్రమున్
వేములవాడ భీమకవి వీరుని తిట్టును రిత్త పోవునే.

ఇతని నిర్యాణమును గూర్చి కూడ యొక్క ప్రతీతి కలదు. ఈతడు కళింగ గంగును దీవించు సందర్భములో "కవిరాజ భయంకర మూర్తి జూడగా బోయెను మాసమాసమున బున్నమ వోయిన షష్టినాటికిన్" అని నుడువుటలో తన నిర్యాణమును సూచింపబడు పదంబుండుట నునుగొని తనను కాలము సమీపించెనని తల్లితో చెప్పెనట.

భీమకవి కూడ రాఘవ పాండవీయమును రచించెనని పింగళి సూరన తన రాఘవ పాండవీయములో చెప్పినాడు :-

"రాము భారత కథల్ గోడింప భాషాప్రౌఢిన్ భీమన తొలి చెప్పె నను పెద్దల మాటయే" కాని యా ప్రతి శిలమైనదని వాడుక. మరియు యితడు "భీమన ఛందమను" ఛందోగ్రంధమును, యనేకములగు చాటు పద్యములను కూడ రచించెను. ఇట్టి రచనా వైచిత్రిని చూపిన భీమకవి నన్నయకంటె పూర్వమే యుదయించి తెలుగు సాహితికి మార్గదర్శకుడైనాడు.



పరువు పోయేవేళ....

శ్రవ్య నాటిక

శ్రీ ఆరుద్ర

పాత్రలు :

శాంత	కైలాసం
శేఖరం	గోపాలం
	రమణయ్య

(రద్దీ ఎక్కువగా వున్న రోడ్డు చప్పుళ్ళు. మనుషుల హడావిడి ధ్వనించే సూచనలు.)

అమ్మాయి : ఛీ. మృగాల్లాగా, ఎంత తప్పుకుని నడుస్తున్నా నెట్టుకుంటూ పోవడమే....

(హడావిడి సూచించే ధ్వనుల స్థానే ప్రశాంతమైన బీచిరోడ్డు, అప్పుడూ దప్పుడూపోయే కారులచప్పుళ్ళు వినిపిస్తుంటాయి.)

అ : హమ్మయ్య, ప్రతిరోజూ తీర్థప్రజే. ఎక్కడికో వారి ప్రయాణం. ఏమిటో యీ హడావిడి, హుఁ, (చిన్నగా నవ్వుకుంటూ) జీవితకాలంలో అడుగడుగునా రైలు తప్పిపోతూనే వుంటుంది వీళ్ళకి. ఎన్ని సార్లయినా ప్రయత్నంమానరు. ఆశ చావదుగా— (బూట్ల చప్పుడు అమ్మాయి మాటలతోపాటే వినిపిస్తూటుంది.)

అ : (నెమ్మదిగా తనలో తానుగా) ఎవరు చెప్మా... వెనకాతల? పోలీసా ? పోకిరా. (నవ్వు కుంటుంది) ఏం చేస్తాడేం? మింగెయ్యడుగా? అయినా మనకెందుకు? రోడ్డు వదలి యిసుకలోకి వెడతాను ... వెనక్కి తిరిగి చూస్తేనా.... ఛ అపార్థం చేసుకుంటే.

(కెరటాల చప్పుళ్ళు)

ఇంకా చీకటిపడి రెండుగంటలేనా కాలేదు. బీచంతా ఎంత నిశ్శబ్దంగా వుంది. యీ కెరటాల హోరు గుండెల్లో భయం పుట్టిస్తుంది. అయినా. యిలాంటి సముద్రంలో పడి ఎలా చచ్చిపోతారో ... ఎందుకో భయం వేస్తూంది. వెన్నులోంచి ఒణుకు పుట్టుకొస్తూంది. ఆ బూట్లమనిషి వెన్నంటి రావడం లేదుకదా కొంపతీసి. (వెనక్కి తిరిగిచూసి భయపడ్డట్టు ఒక్క కేక వేస్తుంది) ఏయ్, ఏమిటీ వేషం? ఎవరూ నువ్వు?

అబ్బాయి : (తేలిగ్గా నవ్వేస్తూ) వేషాన్నిబట్టి ఊహించుకోలేవూ?

అమ్మాయి : (లోపల్లోపల) పరవాలేదు, అంత తోడేల్లా లేడు —

అబ్బాయి : ఏమిటి గొణుక్కుంటున్నావు ?

అమ్మాయి : (హేళనగా) అబ్బే, ఏదో దిక్కు దారి తోచక యిలా ఏకాంతంలో ప్రశాంతతని పొందాలని తాపత్రయపడే నాలాంటి వాళ్ళని అడుగులో అడుగులు వేసుకుంటూ.......

అబ్బాయి : ఆగాగు. అందుకే నిన్ను వెంటాడుత. అమ్మయ్యో, చిన్నదానివి. అందకత్తెవి. యిలా దభీలుమని సముద్రంలోకి ఉరికేస్తే పాపం నాదికాదూ?

అమ్మాయి : నీదెందు కవుతుందీ? నా ప్రాణం అంత విసిగించిన వాళ్ళదౌతుంది.... సరేకాని, నేనూ సముద్రంలో పడతానని ఎందుకూహించు కున్నావు?...

అబ్బాయి : అలా అడుగు చెప్తాను. ఇలాంటి నిశీధిలో సముద్రం ఒడ్డుని ఆడపిల్లలు ఏకాంతంలో ఎందుకొస్తారు? భగ్న ప్రేమలని మటుమాయం చేసుకొందుకు, (ఆవేశంతో) విరిగిన హృదయాలని యాపుమాపు కొందుకు. పోయిన పరువు ప్రతిష్టలని తిరిగి తెచ్చుకోలేక అవివేకలోకంలో మనలేక యీ నీళ్ళలో

తలదాచుకొందుకు. అమ్మాయి, దాచక నిజం చెప్పు. నువ్వు అందుక్కాదూ వస్త.

అమ్మాయి : (చిన్నగా నవ్వుతూ) అబ్బే, అందుక్కాదు.

అబ్బాయి : మరెందుకు?

అమ్మాయి : ఆలోచించు కుందుకు. నాకీ ప్రపంచంలో ఆలోచించుకుందుకు స్థలంలేదు. అందుకని యిక్కడికి వచ్చాను. నక్షత్రకుడిలా నువ్వెవరో సిద్ధం యిక్కడ! హుం. యీ లోకంలో నాకు చావడం తప్పించి యింకేం పనిలేదు.

అబ్బాయి : మనలో మనమాట. నాకు అందమైన ఆడపిల్లలంటే యిష్టం. వాళ్ళ చుట్టూ కష్టాల ముళ్ళపొద లుంటాయంటే అసహ్యం. అందమైన కళ్ళు చెమరుస్తే నా హృదయం మూగవోతుంది బాధతో.

అమ్మాయి : అబ్బాయిగారూ, మీ భావ కవిత్వాన్ని కట్టిపెట్టి దయచేయండి, మనకీ ప్రాథమిక హక్కులనేవి వున్నాయి. ఆలోచించు కోవడం, ఏకాంతాన్ని వాంఛించడం - నా జన్మహక్కు.

అబ్బాయి : (నవ్వుతూ) నాకూ కొన్ని జన్మ హక్కులున్నాయి....

అమ్మాయి : సదే అఘోరించండి నే పోతున్నాను.

(కెరటాల చప్పుడు. ఒక్కసారి గట్టిగా వినపడి దూరం అయిపోతుంది. అబ్బాయి బూట్ల చప్పుడు)

అమ్మాయి : అయితే నన్ను వదలవా?

అబ్బాయి : ఉహుం. మీరెవరో? ప్రయాణం ఎక్కడికో? మీకొచ్చిన బాధేమిటో చెప్తేకాని వదలను.

అమ్మాయి : (నవ్వుతూ) అయ్యో డాకటేరూ. నా ప్రయాణం నీ దగ్గరకే. నా కొచ్చిన బాధలా – దగ్గు రొంప తలనెప్పి, నీరసం, విస్త్రాణ...గుండెదడ...

అబ్బాయి : (గట్టిగా నవ్వేస్తాడు)

అమ్మాయి : అయితే మందిస్తారా?

అబ్బాయి : దానికేముందీ, ముందు రోగ లక్షణాలు పూర్తిగా తెలియనియ్యండి. చెప్పు....నేనెంత దూరం నుంచో నిన్ను వెంటాడి వస్తున్నాను. ఆ జన సందోహంలో కూడా నీవొక ఏకాకివని పోల్చేశాను. నీ అడుగుల తడబాటు నీ ముఖంలో విసుగూ అలసటా ....నీ చెరిగిన ముంగురుల దుడుసుతనం...

అమ్మాయి : (హేళనగా) నీ కవిత్వం బాగుందినాయినా ఎదుటివాడు ఏడ్చి చస్తూంటే....

అబ్బాయి : (లాలనగా) చెప్పు అమ్మాయీ – చెప్పు. నేను దుష్టుణ్ణి కాను. నాకు కోరల్లేవు.–హుం వుండేవి అవి మా నాన్న ఆస్థి కాస్తా పీకేసింది. మళ్ళీ కట్టించుకుంటే లాభం లేదని వూరుకున్నాను.

అమ్మాయి : ఓహో, అలాగా, నాకలాంటి బాధేం రాకుండా మా నాన్న ఆస్థి పాస్తులు చేరవేయలేదు, ఈ లోకాన్ని కోరలతోనే జయించుకొమ్మని బోధించి వెళ్ళిపోయాడు. యిదెంత చెప్పినా మా రవణయ్య మామకి మటుకు అర్థంకాదు. నీదీ అలాంటి గజ చర్మమూ, మందబుద్ధీ అయితే నీ కర్మ!

అబ్బాయి : ఐతే, మనిద్దరం యిన్నాళ్ళూ పోల్చుకోలేదు కాని, చాలా సన్నిహితులం. నీ చాటున బ్రతకవలసిన వాణ్ణి నేను.

అమ్మాయి : (ఆశ్చర్యంగా) అంటే...

అబ్బాయి : అంటే అంతే, చూడు నీ గురించి చెప్పు. తరువాత నే చెప్తాను.

అమ్మాయి : (అయిష్టంగానే) మానుతున్న గాయాలని రేపడం ధర్మంకాదు.

అబ్బాయి : అవి మానడంలేదు కాంతా, పైన గూడు కట్టుకుంటున్నాయి. వాటిని మూలంతో పాటు కడిగి వేయాలి...

అమ్మాయి : (నవ్వుతూ) బలేవాడివీ, నా పేరు కాంత కాదు శాంత.

అబ్బాయి : (నవ్వుతూ) శాంతి. ఓం శాంతి! చెప్పు. త్వరగా చెప్పు.

అమ్మాయి : అవును. ఆ రోజులలో నాకో పదిహేనేళ్ళుంటాయి,

(అమ్మాయి కంఠధ్వని మింగేస్తూ, ఫాక్టరీ చప్పుళ్ళు)

గోపాలం : (అధికారం ధ్వనించే కంఠ స్వరంతో) బోయ్. బోయ్....

బోయ్ : ఎస్సార్.

గోపా : చూడు కైలాసంగారువస్తే అర్జంటుగా రమ్మను యిక్కడికి.

బోయ్ : వారొచ్చి అరగంటయిందండి.

గో : అయితే వెళ్లి నే పిలుస్తున్నాను రమ్మను.

(కొంచెం విరామం)

గో : నమస్కారం. రండి. కైలాసం గారూ.

కైలా : నమస్కారం. ఎందుకో అర్జంటుగా రమ్మన్నారట.

గో : అదేనండీ ఆడిటింగుని గురించీ....

కైలా : (నవ్వుతూ) దాన్నిగురించి బాధెందుకండీ, వాళ్ళ లెక్కలు వాళ్ళు చూచుకుపోతారు— మనకేం భయం?

గో : అహఁ, భయమని కాదూ. (నసుగుతూ) ఎందుకైనా మంచిదనీ....

కైలా : నాకర్థం కావడంలేదు గోపాలంగారూ. దొంగ వోచర్లూ, బ్లాకు పద్దులూ ఏం లేనప్పుడు భయం దేనికండీ మీ బంగారుగాని....

గో : అంత సులభంగా కొట్టి పారేస్తే— వ్యాపారం నిలుస్తుందటయ్యా? ముక్కు మూసుకుని నీలాగే నేనూ యిక్కడ వెలిగిస్తే ఎప్పుడో దివాలా తీసే వాళ్ళం. సరేగాని నీ ఉపకారం కావాలయ్యా కైలాసం....

కైలా : అదెప్పుడూ వుండనే వుంటుంది.

గో : (నసుగుతూ) ఏం లేదూ ఏదో లెక్కలో తక్కువచ్చింది.

కైలా : (ఆశ్చర్యంగా) ఏమిటి? ఎలా వచ్చింది? తక్కువ !

గో : అదేనయ్యా వ్యాపారం అంటే?....గోలచేసుకుంటే మన పరువుకే నష్టం. ఏదో లోపాయికారీగా తేలిపోవాలి.

కైలా : (ఉద్వేగంతో) అయ్యా గోపాలంగారూ, ఇలాంటివేం నాదగ్గిరసాగవు. పరువేంటి? ప్రతిష్ఠేంటి? వెధవపన్లు చేసి వాటిని నిలుపుకోకపోతే ఏం పోయింది?

గో : (సీరియస్‌గా) అలా అడుగు చెప్తాను. పరువు పోయాక బ్రతకలేం. అది ఉండబట్టే కదటయ్యా యీ పలుకుబడీ సంఘంలో గౌరవమూనూ— దివాలా తీసి జైళ్లపాలైతే నీ కూతురు గతేంకాను? నా కొడుకుగతేంకాను? .... యివన్నీ ఆలోచించుకో వొద్దటయ్యా? ఏదో వెర్రిమాలోకంగా వున్నావు !

కైలా : (కోపంతో) అవును. నాలాంటివాళ్ళు నీకు వెర్రిమాలోకవే మరి. ఉహుఁ. వేషాలకోసం హోదాకోసం వూరు సొమ్ము సొంతం చేసుకుని... ఛీ, నీ ముఖం చూడడం తప్పు. నావాట నాకిచ్చెయ్. లెక్కలు రడీ చెయ్యమను. పార్టనర్‌ట !!

గో : (శాంతిగా) ఆవేశపడి ఏం లాభం లేదు. ఆలోచించుకో. లెక్కలూ పద్దులూ తేల్చడం అయింది. అందుకే ఆలోచించుకోమంటున్నాను. (అనునయం ధ్వనిస్తూ) చూడు కైలాసం, యిద్దరం యిప్పుడు యిరుకున పడ్డాం. నాకున్నంత బాదరబందీ నీకు లేదు. నీ కూతుర్ని కళ్ళల్లో పెట్టి కాపాడుతాను....

కై : (ఆవేశంతో) ఆఁ, నా గొంతు కోద్దామనా?.... గోపాలం. ఏమిటి నీ వుద్దేశం? పాపం ఎరుగని నాకా చిచ్చుపెడతావు?

గో : పరువు ప్రతిష్టలోయ్ బాబూ, అవి కాపాడుకోవాలి. అంతే. అనవసరంగా ఆవేశపడకు. నెమ్మదిమీద ఆలోచించుకో అది నీమంచికే... వెళ్ళు....

(కెరటాలచప్పుడు నెమ్మదిగా ఆక్రమించుకుంటుండగా)

అమ్మాయి : ఆరోజు అలా జరిగిందట ఫాక్టరీలో.

చాలా చిన్నబోయి వచ్చాడు నాన్న. మా అత్త తప్ప మాయింట్లో ఆడదిక్కులేదు. ఆవిడకి మామయ్య తప్ప యింకోళ్ళ ఆలోచన లేదు... నాన్న చెప్పినది విని అయ్యో అనేనా అనలేదు అత్త. పైగా, పోనీ ఏదైనా బేరం పెట్టలేకపోయావా? అంది. నాన్నగారికొచ్చిన కోపానికి చెలియలి కట్టలేకపోయింది. కాని, అసమర్థుని కోపం తాటాకు మంట ! ఏమంటారు అబ్బాయిగారూ.

అబ్బాయి : అంతేనండి శాంతగారూ, తరవాతేమైంది? ఈరోజు మీరిలా ఎక్కణ్ణుంచి బయలుదేరారు?

గో : ఇంతకీ ఆ అమ్మాయికీ పరారీ అయిన మన పాట్నర్ కైలాసానికీ సంబంధం వుందిట.

అబ్బా : అవున్నాన్నా. రక్తసంబంధం, సాక్షాత్తూ, కైలాసంగారి కూతురా అమ్మాయి. పాపం, ఏం కష్టం వచ్చిందో సముద్రంలో పడ్డానికి సిద్ధపడింది. నేనే కనుక ఆదుకోక పోతే....

గోపా : (విసుగ్గా) అఘోరించలేక పోయావ్. అయినా అర్థరాత్రి పూట వీధిలంట తిరుగుతున్నావ్, యింత చదువూ చదివింది యిందుకట్రా ?

అబ్బా : నాన్నా. ఆగండి. మీ పరువు ప్రతిష్ఠల కోసం పచ్చని సంసారంలో చిచ్చు తెచ్చారు. వున్నది కూతురికి ఆధారం లేకుండా చేశారు. ఇప్పుడీ రవణయ్యని పెట్టుకుని ఆటలాడుతున్నారు. నాన్నా. అన్యాయాలకీ, అఘాయిత్యాలకీ అడ్డులేదా? అమాయకుల నిలాగా దోచుకోవడం? నాశనం చెయ్యడం? ఏమిటీ దురన్యాయం?

గోపా : (తప్పట్లుకొట్టి) వండర్‌ఫుల్. అద్భుతంరా అబ్బాయి, సరిగ్గా సినిమాల్లో శ్రామిక నాయకుడిలా ఉపన్యసించావు.

అబ్బా : (ఆవేశంతో) ఉపన్యాసం కాదు నాన్నగారూ, యిది మూగ హృదయాల ఘోష. ఈ రోజు యివి మీకు వినిపించక పోవచ్చు. వినిపించుకో తలచుకోక పోవచ్చు, కాని ఏనాటికైనా అవి మీ హృదయం చుట్టూ పొదగబడ్డ యినుపతెరలని చీల్చుకు లోపలికి చొచ్చుకుంటాయి. ఆనాడు ఖేదపడి లాభం వుండదు నాన్నగారూ. లాభం వుండదు.

గోపా : (హేళన ధ్వనిస్తూ) చదివిన చదువు కింతటి రాజసం అబ్బిందిరా? చూడు శేఖరం, వ్యాపారం, నాది. దాని బాగోగులు చూసుకోవలసిన బాధ్యతనాది. నీకూ దీనిలో భాగం కావాలంటావా? బాగోగులు గుర్తించు. లేదంటావా. హాయిగా జమీందారుగారి చిన్నబ్బాయిగా చెలామణి అవు. అంతేకాని, వెధవ్వేషాలు వెయ్యకు. వెళ్ళు, ఆలోచించుకో.

అబ్బా : ఆలోచించు కున్నాను. నాన్నగారూ, యిన్నాళ్ళూ మీ ఆస్తిపాస్తుల అండ దండలు లేకుంటే ఎలాగ బ్రతకడం అని ఒణికిపోయాను. కాని, ఒక్క అమాయకురాలు ధైర్యంగా ఒంటరిగా సముద్రపు వొడ్డుని కూర్చుని ఆలోచించుకుంటూంటే – ఆవిడకి జరిగిన అన్యాయానికి ఎవరు బాధ్యులో నేనూ ఆలోచించాను. దానికి మనమే అని సమాధానం వచ్చినప్పుడు అసలు నిజమైన ఆలోచన మొదలెట్టాను. పరువు - ప్రతిష్ఠల కోటుని యింట్లో తిరగేసి తొడుక్కునే మీ తత్వం బాగా అవగాహనైంది. చాలు నాన్నగారూ, మీ వ్యాపారం వద్దు నాకు.

గోపా : ఆవేశం పనికిరాదురా అబ్బాయి. ఆ రవణయ్యని చూడు ఏ ఎండ కా గొడుగు పట్టకపోతే యీ సంఘంలో హుందాగా ఎలాగ బ్రతకడం ?

అబ్బా : నాకొద్దు. నన్ను నాకు తోచినట్లు బ్రతకనివ్వండి

(వెళిపోతూ దూరం నుంచి)

మీకూ నాకూ మధ్య పరువు ప్రతిష్ఠల వైతరణి హోరెత్తి ప్రవహిస్తూంది నాన్నగారూ. మీ రవతలి గట్టున, నేనివతలి గట్టున.

గోపా : (బాధగా) శేఖరం, జరిగిందేదో జరిగిపోయింది రా మాట్లాడాలి.

శేఖ : మనసు విరిగిపోతే ఎంతో. పరువు పోయినా అంతే నాన్నగారూ, మీ కున్న యీ అప్రతిష్ఠపు పరువు పోతేగాని, లాభం లేదు–రా శాంతా.

శాంత : ఎక్కడికి?

శేఖ : వీరి పోయిన పరువు వెతుక్కువద్దాం.

(వాచీ టిక్కు టిక్కు)...

గో : రమణయ్యా....

రమ : అయ్యా.

గో : చూశావా, వాడి దారుణం.

రమ : చూశానుగా కళ్ళారా చూశాను. ఎంత అప్రతిష్ఠ. కొట్టినట్టు....

గో : జరిగినదానికి బాధపడడం లేదయ్యా. జరగపోయే దానికే భయపడుతున్నాను. నేను ఏంత పరువుగా బ్రతుకుతున్నానూ, వీడు ఆ అమ్మాయితో వేరే కాపరం పెడితే నలుగురూ నన్ను నాలుగు విధాలా అనుకోరుటయ్యా.

రమ : ఎందుకనుకోరు ?

గో : నామాట కాదని వాడెలాగూ దాన్ని పెళ్లాడే టట్టున్నాడు. నేను దగ్గర లేకుండా వాడి పెళ్ళి జరిగితే నాకు తలకొట్టేసినంత అవమానం కదటయ్యా?

రమ : అయితే, ఈ పెళ్ళికి వప్పుకొంటారేమిటి కొంప తీసి. కైలాసం కూతురికీ మీ అబ్బాయికీ పెళ్ళేమిటి— నలుగురూ నవ్విపోతారు.

గో : అది కాదయ్యా.

రమ : మీరు లక్ష చెప్పండి. సమానవియ్యం సమాన కయ్యం అన్నారు.

గో : అన్నారు నిజమే. ఇంతకి ఆ అమ్మాయి తండ్రి ఒకానొకనాడు నా పార్టనరేకదా. సిరిసంపదల్లో అతనికీ నిజానికి భాగముంది. కాబట్టి మేం సమాను లమే అవుతాం.

రమ : అంటే మీ ఉద్దేశం, కైలాసాన్ని వెతికించి సగం భాగం యిద్దామనా?

గో : యిస్తే తప్పేం?

రమ : ఛఛఛ—మీరా ఇలా అంటున్నది! ఎందుకు యింత ఆస్తి పోగుచేశారో, ఎందుకు ఇంత డబ్బు వెనకేశారో ఆలోచించండి.

గో : అదే ఆలోచిస్తున్నా. మోసాలు చేశాను. దొంగ పద్దులు కల్పించాను. కుట్రలు పన్నాను. నన్ను నమ్మి నాతోటే వ్యాపారం చేసిన స్నేహితుడి జీవితాన్నే పాడుచేశాను. అతని భాగాన్ని కబళించాను. డబ్బు ఆర్జించాను. నిలవచేశాను. యింకా ఆర్జిస్తున్నాను. ఇంకా నిలవ చేస్తున్నాను, ఎందుకు చేస్తున్నా నంటావు? ఏం రమణయ్యా మాట్లాడవు?

రమ : ఏమో.......

గో : పోయేనాడు నాతో పట్టుకుపోడానికా? కాదు. నా కొడుక్కిద్దామనేగా. వాడే యింట్లోంచి పోయాక ఈ డబ్బెందుకయ్యా.

రమ : మీమీదే ఎదురు తిరిగిన కొడుక్కి డబ్బిస్తారా?

గో : నామీద ఎదురు తిరగలేదోయ్ వాడు. వాడు నాలోని దురహంకారాన్ని శిక్షించాడు.

రమ : ఏమిటోనండి, మీరిలా మారిపోతారనుకోలేదు. అలాంటివాణ్ణి క్షమిస్తారా?

గో : లేకపోతే నన్నా భగవంతుడు క్షమింపడయ్యా. పద- వాడెక్కడున్నాడో వెతుకుదాం.

(కీచురాళ్ల చప్పుళ్లు)

(సముద్రపు ఘోష- క్రమంగా సన్నగిలి శాంత, శేఖరం గొంతుకలు వినిపిస్తాయి)

శేఖ : పట్టపగల్లాగ వెన్నెల ఎంత బావుంది- ఈ వెలు గులో మన భవిష్యత్తు కూడా కనబడేటట్టుంది.

శాంత : అవును. యిన్నాళ్ళూ ఎంత గాలించినా కన్పట్ట లేదు. (తనలోగా) హుఁ, ఆ గర్భ శ్రీమంతుని యింట ఆదర్శం ఉండలేక పేదరికానికి దత్తు వెళ్ళి నట్లుంది— యీ అబ్బాయి నావెంట రావటం.

శేఖ : ఏమిటి గొణుక్కుంటున్నారు?

శాంత : వాలో నేను ఏదో అనుకుంటున్నాను.

శేఖ : నాగురించా?

శాంత : అవును.

శేఖ : ఏమిటీ?

శాంత : (నవ్వుతూ) బహిరంగంగా అనతల్చుకున్న మాటలు ఎవరూ తనలో తాను అనుకోరు.

శేఖ : అభిప్రాయ స్వాతంత్ర్యం అందరికీ వుంది. కాని నా గురించి మీరేమనుకున్నారో తెలుసుకోవాలనివుంది.

శాంత : అబ్బే ఏంలేదు. సిరిసంపదలకీ ఆదర్శాలకీ పొసగదు కాబోలు. అనుకొన్నాను.

శేఖ : అరె, ఆ సంగతి బాహాటంగా అనొచ్చే. మన స్సులో ఎందుకనుకున్నారు?

శాంత : ఏంలేదు,

శేఖ : శాంతికి మొహమాటం కూడదు. నిర్భయంగా ఉండాలి శాంతి.

శాంత : (నవ్వుతూ) ఉందునబ్బాయిగారూ, కాని, లోకం ఉండనివ్వదే. నేనేదో నిర్మొహమాటంగా వుంటే బరితెగించింది అనేది అత్తయ్య. తన పరువు కాస్తా గంగపాలయిపోతోందని వాపోయేవాడు మామయ్య.

శేఖ : నిజం నిజం. మరి, స్వలాభానికి చాటూ మాటూ వుండాలి. (నెమ్మదిగా) మనలో మనమాట— మీరు లోలోన అనుకోవడంలో ఏదైనా స్వలాభం వుందా?

శాంత : (నవ్వుతుంది)

శేఖ : శాంతగారూ, నన్నుగురించి చెప్పుకోనివ్వండి. మానాన్న వుద్దేశంలో నేను చేసే పని- నేలవిడిచి సాము; కాని, (ఆవేశంలో) నా వుద్దేశంలో నేల మీదకి స్వర్గాన్ని తీసుకువద్దామని.... శాంతగారూ, యీ ప్రపంచం మనిషికి నరకంలా వుంచే ఎలాగ చూస్తూ వూరుకోవడం? మాయా మర్మం ఎరుగని అమాయకులు అర్థంలేకుండా కపటులకీ స్వార్థపరులకీ ఎర కావలసిందేనా? శంఖాలు ఊది ఊది భగ వంతుని చెవులు తూట్లు చేసేస్తారు భక్తులు. అంచేత ఆ భగవంతుడెవడో ఎలాగా కన్పించడు కనుక మనమే భూతల స్వర్గసృష్టికి నాంది పలకాలి. ఏమంటారు శాంతగారూ?

శాంత : (నవ్వుతుంది)

శేఖ : ఎందుకు నవ్వుతున్నారు.

శాంత : (ఇంకా నవ్వుతుంది.)

శేఖ : (కొంచెం చిరాగ్గా) ఎందుకానవ్వు? నన్నుచూశా?

శాంత : కాదు.

శేఖ : నా ప్రయత్నం చూశా?

శాంత : (నవ్వుతూనే) మబ్బులో నీరుందని కుండలో నీళ్ళు పార పోసుకునే మీ అమాయకత్వాన్ని చూసి. (నవ్వుతుంది.)

శేఖ : శాంతగారూ, ఏమిటానవ్వు? యిలా విరగబడి నవ్వితే, ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?

శాంత : (సీరియస్‌గా) యిప్పుడు మిమ్మల్ని చూసే నవ్వాలి!

శేఖ : ఎందుకు?

శాంత : మీరు సరిగ్గా మీ నాన్నగారిలాగే మాట్లాడే స్తున్నారు.

శేఖ ; నేనేమన్నాను? నలుగురురూ చూస్తే ఏమనుకుం టారూ? అన్నాను అంతేగా.

శాంత : అంతే మీ నాన్నగారూను. ఇందాకా చూశారా. పరువువోయ్, ప్రతిష్టపోయ్, బాబూ అంటూ నోరు నొక్కుకున్నారు.

శేఖ : ఆయన భయానికీ, నా అభిప్రాయానికీ తేడా లేదా శాంతగారూ?

శాంత : మహానగరంలో రోడ్డుమీద మన గురించి ఎవరూ పట్టించుకోరు. పరువున్నా ఊడినా ఏమైపోయి నా ఎవరిక్కావాలి? ఆఫీసులలో బాంకులలో తొందరగా బిరువుగా పోతారు. వస్తారు. అలస్యం చేస్తే బస్సు దాటిపోతుంది. అలస్యం చేస్తే అధికారి కోపగిస్తాడు. అంచేత చుట్టూరా ఏముందో పక్క నెవరున్నారో పట్టించుకోరు నాగరికులు.

శేఖ : (నవ్వుతాడు)

శాంత : ఎందుకు నవ్వుతున్నారు?

శేఖ : నాగరికులని గురించిన మీ నిర్వచనాన్ని విని.

శాంత : అది తప్పు నిర్వచనం కాదే?

శేఖ : ఈ మహానగరపు హోరులో, హడావిడిలో ఒం టరితనాన్ని, భయాన్ని, చాంచల్యాన్ని నేను గుర్తించ గలిగాను, శాంతగారూ, యీ సంఘం నన్ను నాగరి కునికిందే లెక్కవేస్తూంది. మీరేమంటారు?

శాంత : అవును. మీరు నాగరికులు. అందుకే మీ యీ నాటి ప్రవర్తన మీ నాన్నగారికి నచ్చలేదు. పెద్దల దృష్టిలో—ఇంటిలో ఎలా వున్నా ఫరవాలేదు. వీధిలో ఆచారాలు పాటించు అని, కాని.......

శేఖ : కాసీ లేదు, పైసాలేదు, రండి నాకు తోడు రండి, యీ జీవితాన్ని పంచుకొండి, నాకు ఉద్యోగం వుంది. యీ రాత్రి ఎక్కడో తలదాచుకుందాం, రేపు ఉదయాన్ని ఇల్లు చూసుకుందాం; పెళ్ళి చేసుకుందాం. ఏమంటారు శాంతగారూ?

శాంత : దాంతో మీ నాన్నగారి పరువు పూర్తిగా పోతుం దంటాను, శేఖరంగారూ!

శేఖ : పోనీండి, ఫరవాలేదు, ఈ విశాల ప్రపంచంలో ఒక్కడి పరువు పోయినా ఫరవాలేదు. ఒక్క జీవికి ఆనందపుటవధులు చేతికందినప్పుడు ...... అరె- అటు చూడు ఎవరాయన. అదేమిటి నీళ్ళకి దగ్గి రగా పోతున్నాడు.

(కెరటాల చప్పుడు)

అరె, కెరటాలు విరుచుకు పడుతున్నాయి. ఆ తరం గాల కురంగాల కదనుకి భయపడని మనిషి ఎవరు? లేవండి. శాంతగారూ ఆయన అఘాయిత్యం చేయ కుండా ఆపుదాం.

అమ్మాయి : ఆపి— ఏంచేయగలం. ఆ హృదయంలోని ఆవేదన ఆర్పగలమా. పోనీండి. ఆయన హృదయంలో రేగిన దావాగ్నికి సరిపడ్డ నీళ్ళు ఒక్క సముద్రుడే అందివ్వగలడేమో.

అబ్బాయి : అదేంమాట. మన కళ్ళముందు ఒక మనిషి ప్రాణాలు తీసుకుందుకు ప్రయత్నిస్తే పూరుకుంటామా. ఇది మనకు న్యాయంకాదు.

అమ్మాయి : న్యాయానికి, ధర్మానికి నీతికీ బలవంతపు చావు తప్పదు.

అబ్బాయి : లోకంమీద మీకున్న కసి యింకా పోలేదా? ఉండండి అతణ్ణి ముందు రక్షించాలి.

(కెరటాలు)

ఆగండి- ఆగండి. ఆ నీళ్ళలోనికి వెళ్ళకండి.

అబ్బాయి : ఎంత దారుణానికి ఒడికట్టారండీ. ఇంకొంచెం లోపలికి వెళితే ఏమయ్యేది?

కైలా : ఏమయ్యేది? నాకు శాంతి లభించేది. నా మనస్సులోని అగ్నిపర్వతం చల్లారేది, అంతా సుఖాంతమయ్యేది.

అమ్మాయి : ఎవరు? ఎవరు?నాన్నా- నువ్వా? నువ్వా?

కైలా : శాంతి- శాంతి. నువ్వా అమ్మా!

అమ్మాయి : ఈయన మా నాన్న శేఖర్‌గారూ. మీరు కాపాడింది మా నాన్నని. నాన్నా, నాన్నా. ఎంతపని చేయబోయావు!

కైలా : నిజమేనమ్మా. ఇల్లు వాకిలీ వదలి ఏకాకిలా తిరిగాను, ఎందుకీ బతుకనిపించింది. ఎప్పటికప్పుడు చచ్చిపోదామను కున్నాను. మరెక్కడా మరణించడానికి మనస్కరించలేదు.

అమ్మా : అందుకు యిక్కడకొచ్చావా? ఏ సముద్రం దగ్గర చిన్నప్పుడు నన్ను ఆడించావో,—ఏ ఇసుకలో నాకోసం పిచికగూళ్ళు కట్టావో, అక్కడ మరణించలనుకున్నావా?

అబ్బా : అవును. స్వగ్రామంలో బ్రతకలేక పోయినా, కొందరు చనిపోదామను కుంటారు. అయినా, ఏ ఒక్కరూ చేతులారా ప్రాణాలు తీసుకోవలసిన అవసరంలేదు.

కైలా : ఈయనెవరమ్మా?

అబ్బా : మిమ్మల్ని మోసం చేసినవాడి కుమారుణ్ణి.

కైలా : గోపాలం కొడుకువా? గోపాలం రక్తంలో మంచిదనం కూడా ఉందన్న మాట.

శాంత : అరె- ఎవరో యిటొస్తున్నారే.

గో : నేనూ— గోపాలాన్ని. అబ్బాయి- జరిగింది. మరిచిపోయి ఇంటికి రా, అరె- కైలాసం! కైలాసం, కైలాసం- నన్ను క్షమించు. నీకు నేను చేసిన అన్యాయం మరిచిపోలేవుగాని.......

కైలా : గత జీవితాన్ని ఎవరూ మరిచిపోలేరు గాని, మానిపోయిన గాయాన్ని మళ్లా నొప్పించలేరు.

(కెరటం విరిగి పడుతుంది.)

గో : పెద్దకెరటం వస్తూంది తప్పుకోండి.

అబ్బా : యింక ఏ కెరటానికీ భయపడక్కర్లేదు నాన్నా. పదండి పోదాం.

(రేడియో ప్రసారితం)

కథానిక

చివరకు జరిగింది!

వి. కె. సారధి

నాలుగు సంవత్సరాల క్రితం, ఏదో పనిమీద ఆవూరు వెళ్ళాలసి వచ్చింది. వస్తున్నానని ముందుగా నా మిత్రుడు సుబ్బారావుకి వుత్తరం వ్రాశాను. అనుకొన్నట్లుగానే, వాడు ఆరోజు నన్ను స్టేషన్‌లోనే ఆహ్వానించాడు. కుశల ప్రశ్నలనంతరం, ఇద్దరం వాడి ఇల్లు చేరాం. తాను ఆఫీసుకు వెళ్ళాలని, నన్ను తనకై నిరీక్షించక, భోంచేసి, విశ్రాంతి తీసుకోమని చెప్పి వెళ్ళిపోయాడు.

సరిగ్గా గంట పండ్రెండు కొట్టింది. బద్ధకంగా లేచి, స్నానంచేసి, భోంచేసి, అలా కిళ్ళీకొట్టువరకు వెళ్ళివద్దామని బయులుదేరా. అలా పది అడుగులు వేశానో లేదో ఎవరో పిలిచినట్లయి వెనుతిరిగి చూచా. ఆ స్వరం పరిచయమైన వ్యక్తిదే అని బాగా గుర్తించుకొన్నా. లలిత- ఆనాటి మా కాలేజీ చదువుకు, ఇప్పటికీ చాలా మారిపోయింది. మనిషి కేవలం చాల బలహీనురాలై యున్నది. నన్ను కూర్చోపెట్టి ఓ గ్లాసులో మజ్జిగ తీసుకొచ్చింది. ఒక్క నిముషంలో గ్లాసు కాళీచేసి ఆమెకు అందిచ్చా. లలిత అడగనారంభించింది. "ఏం మూర్తీ- ఇంకా వివాహం కాలేదా- వివాహం చేసుకోకుండ, ఎన్నిరోజులని ఈ బ్రహ్మచర్యం గడుపదలచావు."

"చూడు లలితా! నీకు తెలుసు నేనెటువంటివాడినని. ముక్కుకు సూటిగా వెళ్ళేరకం. నాపెళ్ళికి గడిచిన మూడు సంవత్సరాలుగా ప్రయత్నం జరుగుతుంది. నాకిష్టమైన సంబంధం ఏదో కారణంవల్ల మావాళ్ళకు నచ్చటంలేదు. వాళ్ళకు నచ్చిన సంబంధం కొన్నికారణాలవల్ల నాకు నచ్చటంలేదు. ఇలా పెక్కు కారణాలు- నావివాహం దూరం చేస్తున్నది. అన్నట్టు మరిచా! నీ పెండ్లి బాగా జరిగింది గదా, అని సంతృప్తిపడ్డా- ఎక్కడ మీవారు, ఏంచేస్తున్నారు."

ఇంతవరకు ఏదో వింటున్నదల్లా ముఖం మారిపోయింది. దుఃఖం పొంగుకొచ్చేట్లు పొడసూపింది. నేను ఏదైనా అడగరాని ప్రశ్న వేశానా అని ఆమె భానంనుండి గుర్తించుకొన్నా. మెల్లగా యిలా ప్రారంభించా. "ఇదిగో చూడు లలితా! మన స్నేహం ఈనాటిదికాదు. ఆనాటి కాలేజీ రోజుల్లో ప్రారంభించిన మన మైత్రి నేటివరకు కళంకం లేక సాగిపోతుంది. కాని నీమనస్సులో వున్న వ్యధను కొంచెం నా చెవిని పడేయి. నీకు ఉపశాంతి కల్గినట్లుంటుంది. నాకు అందు తోడ్పడసందర్భమైనా దొరుకుతుంది."

"చూడు మూర్తీ! పరీక్షలయిన వెంటనే వూరికి వెళ్ళా. పెద్దలచే అప్పటికే నిశ్చయింపబడ్డ పెండ్లి నేనెంతగా బ్రతిమాలినా ప్రయోజనం లేకపోయింది. మొండి పట్టుదలతో నాన్నగారు, ఈ వివాహం జరగని పక్షంలో, తాను నలుగురిలో తలెత్తుకు తిరగ లేనని, మర్యాదగా బ్రతుకలేనని చెప్పారు. కాకపోతే, తాను ఏనుయ్యో, గొయ్యో చూచుకోవడం తథ్యం అన్నారు. నా కోరికలు నా ఆశయాలకొరకు, మంచి మర్యాదలకు మంటగల్పటమూ లేక నా ఆశయాలను సంపూర్ణంగా అన్న దుఃఖసాగరంలో మునిగి తేలుతున్నా. ఇంతలో పెండ్లిరోజు రానేవచ్చింది. అనుకొన్నట్టుగానే నా వివాహం జరిగిపోయింది. నాకు మాత్రం వివాహ పందిరిలో కూర్చొన్నట్లులేదు. ముళ్ళపైన కూర్చొన్నట్లు బాధపడ్డా. ఎందుకు ఒప్పుకున్నా నా అని కూడ యోచించా. నేనెందుకు నాన్న చెప్పినట్లు, ఏనుయ్యో, గొయ్యో చూచుకోకూడదని కూడ తోచింది. కాని చచ్చి ఏమి సాధిస్తామని? ఏంచేస్తాం? అంతా విధియని తలచి, మావారితో కలసి ఈవూరు వచ్చిచేరా.

వచ్చిన క్రొత్తలో నన్ను చాల సంతోషపరచేవారు. చాల ఆదరించేవారుకూడ. కాని క్రమేపి మాలోని మైత్రి వాత్సల్యం నశించ మొదలిడింది. కాల పరిస్థితి ఆయనకు అలవడని దురభ్యాసాలు లేవని స్థిరపరచింది. రెండు సంవత్సరాలు యమయాతననుభవించా. ఇప్పుడు అంతా పోగొట్టుకొని. అనారోగ్య కారణంగా ఆస్పత్రిలో పడియున్నారు. విధి ఎలా వక్రిస్తుందో!

◆ ◆ ◆

భయపడ్డంతా జరిగింది. మరునాడే లలిత భర్త కనుమూశాడు.

ఆరోజు సాయంత్రం లలిత ఇంటికేసి బయల్దేరా. కాఫీ త్రాగి. నన్ను చూడ్డంతోనే లేచి నిల్చుంది. అంతసేపు ఏడుస్తుందేమో కళ్ళు, చెక్కిళ్ళు ఎర్రగా తయారయింది. నేనే ప్రారంభించా. "లలితా! అనవసరంగా జరిగిపోయిన విషయంగురించి బాధపడ్డం బాగాలేదు. ప్రతి పుట్టిన జీవి గిట్టక మానదు. నీవు అంతా తెలిసికూడ బాధపడటం నేచూడలేకున్నా. మన చేతిలోఏముంది. అంతా దైవకృప ఓర్చుకో యిక జరగవలసింది గురించి ఆలోచిద్దాం." లలిత తనకి ఎవ్వరు లేరని, వున్న ఒక్క తమ్ముడు ఎక్కడో దేశాలపాలైనాడని, తాను ఇక ఏకాకి అని చెప్పింది. ఈ పరిస్థితులలో లలితను అలా నడివీధిపాలు చేయటం అంత బాగాలేదనిపించింది. సరే తర్వాత ఆలోచిద్దాంలే అని మావాడి ఇంటికేసి బయల్దేరా.

వస్తూ మనస్సు పరి పరి విధాల పరితపించసాగింది. మావాడు నాకై ఎదురు చూస్తున్నాడు. భోజనం కానిచ్చాం. వాడేదో పనివుండి బయలుదేరి పోతూ, నన్ను అనవసరంగా ఆలోచించి మనస్సు పాడుచేసుకో వద్దని, నిద్రపొమ్మని మరీచెప్పి, వెళ్ళిపోయాడు. గత్యం తరం లేక పక్కలో చేరా. అంత శీఘ్రంగా నిద్ర రాలేక పోయింది. ఆలోచిస్తూ చాలసేపటివరకు పడుకున్నా. ఏది ఒక నిర్ణయం సర్గా చేసుకోలేకపోయా. మరునాడు లలితని, "నేను రేపు బయల్దేరుతున్నా. నీకు అభ్యంతరం లేకపోతే, నీవు మరోలా నన్ను అపార్ధం చేసుకోకపోతే, నా వెంట వచ్చేయి. నీకు ఉపాధి కల్గిస్తా. ఏదైనా స్కూల్లో టీచర్‌గానైనా ప్రవేశ పెడ్తానని అన్నా. మొదట సందేహించింది. కాని చివరకు నాతో రావడానికి యిష్టపడింది.

♦ ♦ ♦

ప్రయాణం చేస్తున్నాము కాని, లలితను మద్రాసులో ఎక్కడ వుంచడమా అన్న ప్రశ్న నన్ను బాధింపసాగింది. ఇంట్లో ఏమంటారో అన్న భయం, హోటలులో దింపుదామా అంటే, లలిత నన్ను అపార్ధం చేసుకుంటుందన్న భయం. ఏమో నాకేం పాలుపోవటంలేదు. నా ముఖ ఛాయలను గుర్తించిన లలిత నన్నిలా అడగసాగింది. "ఏం మూర్తి! ఏదో ఆలోచేస్తున్నట్టున్నావు. ఒకవేళ నావల్ల నీకేదైనా అపదసంభవించదమైతే, నామానాన నన్ను పోనీయి." ఇక లలితను బాధపెట్టడం బాగుండదని, నేనేమీ ఆలోచించడంలేదని బొంకేను.

రైలు దిగి తిన్నగా యింటికి వెళ్ళా. నాన్న బయట అరుగుమీద కూర్చొని, పేపరు తిరగేస్తున్నారు. నన్ను చూసి లేచివచ్చి సంతోషంతో ఏదో చెప్పబోయారు. కాని నా ప్రక్కనున్న లలితను చూచి అలా ప్రతిమలా నిల్చుండిపోయారు. నోట మాట రావటంలేదు. నేను మౌనంగా లోపలకి నడిచా. సామాన్లుఅన్ని సర్ది, లలితను ఇంట్లో అందరికి పరిచయం చేశా. లలిత ఇక్కడే ఉంటుందని, కొద్దిరోజులు తర్వాత వెళ్ళిపోతుందని. అంతవరకు అందరు లలితను జాగ్రత్తగా చూడవలసిందని కోరాను.

నాకే తెలియని ఏదో ఉద్యమం ఉట్టిపడింది. నేనెందుకు లలితను మళ్ళీ పెండ్లాడకూడదన్న సమస్య బాధింపసాగింది. నేను కాలేజి చదివేటప్పుడే, లలిత నన్ను ప్రేమించిందని భ్రమించానే చాలసార్లు. ఒకవేళ ఆమెకూడ యిప్పుడు ఆ అభిప్రాయంతో వుందేమో. లలితను అడిగి సందేహం తీర్చుకొందామనుకొన్నా. ఆరోజు సాయంత్రం ఇంట్లో అందరు గుడికెళ్ళారు. నేను, లలిత, నా తమ్ముడు తప్ప ఇంట్లో ఎవ్వరు లేరు. నేను లలితను పిలచి డాబా పైని కూర్చొని మాట్లాడసాగా. "లలితా! నేనొక్క విషయం అడుగుతా. నీవేమియు దాచకుండ నిజం చెప్తావు కదూ! నీవు నాతో మెలుగుతుంటే కాలేజీ రోజుల్లో, అనేకసార్లు, నన్ను ప్రేమించావని భ్రమ పడ్డాను. నేను అప్పుడప్పుడు అలాగ ఫీలవుతుండేవాడిని. ఏరోజు ధైర్యం చేసి అడుగలేకపోయా. కాని ఈరోజు ఎందుకో అడగాలి అని తోచింది. అడిగేశా. నన్ను అపార్థం చేసుకొంటావేమో అని నాబాధ. ఇంతసేపు నిశ్చలంగా కూర్చొని వింటున్న లలిత, నా చూపులలో కొత్తదనం కనిపెట్టి ముఖమావలకు త్రిప్పేసింది.

లలిత చెప్పనారంభించింది. "నీవు చెప్పింది అక్షరాలా నిజం మూర్తి! నేను ఏవిషయం తేల్చుకొనేలోగా, పరీక్షలయిపోయాయి. మనం విడిపోయాం. ఇంతలో నా పెండ్లి ఏర్పాట్లు- అంతా క్షణంలో జరిగిపోయింది. నేను కేవలం అశక్తురాలయిపోయా. ఆ పరిస్థితుల బారినుండి తప్పలేకపోయా. కాని అప్పుడప్పుడు నిన్ను తలచుకొనేదానిని." లలిత చెప్పింది విన్నంతట నాకు చాల సంతోషమైంది. మనస్సుకూడ నిర్మలంగా వున్నట్లు తోచింది. కారణం- మా ఇద్దరి అభిప్రాయాలు ఒకటే అవటం.

ఇంకేం వివాహ విషయం కూడ తేల్చుకుందామనుకొని ఎలాగో తడబడుతూ అడిగేశా. లలిత అలా మౌనంగా కూర్చుండిపోయింది. "అటువంటి పరిస్థితులలో ఎవరు మాత్రం ఏంచెప్పగలరు" మౌనం అంగీకార సూచకం. అని తలచి, రాత్రి భోజనాలదగ్గర ఈ ప్రసంగం కదిల్చా. నాన్న సుతరాం ఒప్పుకోనన్నారు. అలా చేస్తే ఆస్థిలో

చిల్లిగవ్వ ఇవ్వనన్నారు. "ఏదో ప్రయోజకుడౌతాడని తాను వూహిస్తే, ఈలాటి అప్రాచ్యపు పనులు చేసి, వంశ మాన మర్యాదలు మంటగలప, చెడబుట్టానని తిట్టి పోశారు." ఏమైనా ఉద్దేశం మార్చుకోలేకపోయా.

అంతే తర్వాత రోజు ఎక్కడో ఒక రూం సంపాదించి లలితను తీసుకొని వెళ్ళిపోయా. అమ్మ నన్ను ఎంతగానో బ్రతిమలాడింది. అందరు నన్ను హేళన పరిచారు. ఎందరో నా ప్రయత్నం మానుకోమని సలహా యిచ్చారు. అందరి సలహాలు పెడచెవిని పెట్టా. నా మనస్సులో అశాంతి ప్రబలింది మళ్ళీ. లలిత నాకు ధైర్యం చెప్తుంటుంది. ఒకరోజు అందరం కలసిపోతామని. దానికై నేను బెంగ పడకూడదని కూడ వేడుకొంది. అటువంటి పరిస్థితులలో లలిత నాతో లేకుంటే నేనేంకాను. ఏదో నాజీవితం బరువుగా లాగుతున్నా లోకం దృష్టిలో, మేము పాపుల మైనా, మా ఇరువురిని ఎవ్వరు వేరు చేయలేకపోయారు.

రెండువారాల తర్వాత, నేను లలితను తీసుకొని రిజిస్ట్రార్ సన్నిధిలో వివాహం చేసికొన్నా. ఇప్పుడు నా మనస్సు తేలిక పడింది. ఏదో పెద్ద ఘనకార్యం చేసిన వాడిలా ఫీలవసాగా. అతి కష్టంతో రోజులు దొర్లిపోతున్నాయి. చాలీచాలని జీతంతో మేం సంసారాన్ని లాగుతున్నాం. అంతా ప్రత్యక్షంగా చూస్తున్నా నాన్న, ఏ సహాయం చేయడానికు ముందుకు రాలేదు. నాకు ఆత్మాభిమానం అడ్డొచ్చింది. ఒకవేళ నాన్న చేసుంటే ఒప్పుకొని ఉండేవాడ్నేమో.

కాని మా అన్యోన్య దాంపత్యం, దేవుడు కూడ ఓర్చుకోలేదు కాబోలు. ఆరోజు నాకు కాస్త బడలికగాయుండి, తొందరగా షాపు కట్టేసి వచ్చేశా. ఇంట్లో దృశ్యం నన్ను ఆశ్చర్యపరచింది. కారణం- ఎవడో యువకుడు మంచంపై నిద్రపోతున్నట్లున్నాడు. వాని రొమ్ముపై తన తల ఆన్చి లలిత ఏడుస్తుంది. నాలో అనుమానం అన్న పెనుభూతం ప్రవేశించింది. నేను పరిస్థితిని అర్థం చేసుకోలేక. వెర్రి వెర్రిగా. లలితను ఏదేదో వాగేశా. లలిత నన్ను బ్రతిమాలింది. మొదట తాను చెప్పదలచింది విని, తర్వాత తన్ను నిందించమంది. చేనేమి వినడానికి సంసిద్ధంగా లేనని నిర్మొహమాటంగాచెప్పి వెళ్ళిపోయా. "మానవునిలో అనుమానం అన్న బీజం ఎంత విపరీతానికి దారితీస్తుందో, ఆక్షణాన అవగాహన చేసుకోలేకపోయా." కనీసం ఆ పరిస్థితినైనా అర్థం చేసుకోకుండపోయా.

కొన్ని గంటలసేపు తిరిగి, తిరిగి, విసిగి, ఇల్లు చేరా. ఇంట్లో ఒకటే జనం పోగయ్యారు. నాకేం అర్థం కాలేదు. లోనికి వెళ్ళి చూచా. అంతే. అంతా అయిపోయింది. నా లలిత నన్ను వదలి పోయింది. బలవంతంగా ప్రాణం తీసుకొంది.

ఈలోగా ఎవరో యువకుడు నాకై ఎదురు చూచి ఇప్పుడే వెళ్ళిపోయాడని, నాకై ఉత్తరం ఇచ్చి వెళ్ళాడని చెప్పారు ఇంట్లో. ఆతురతతో ఆ వుత్తరం విప్పి చదువ నారంభించా- అంతే. నా తల తిరుగుతున్నట్లు తోచింది. నే చేసిన పని నాకే ఛీ, అనిపించింది. ఒక క్షణంలో మృగంగా మారి, అన్యాయంగా, ఏపాపమెరుగని నా లలితను, బలిపెట్టుకొన్నా- ఉత్తరంలో

"మూర్తిగారికి- నేనెవరో మీకు తెలిసునేమో. తెలియ నవసరంలేదనుకొంటా. కాని ఈనాడు ఇక్కడ జరిగిన సంఘటనం, మరేనాడు, మరెవ్వరి గృహంలో జరగకూడదన్న అభిప్రాయంతో మీకు నేనెవరో తేల్పుతున్నా. లలిత- నా అక్కయ్య- కొన్ని సంవత్సరాల క్రితం ఇల్లు వదలి పారిపోయా. కొన్ని అనివార్య కారణాలవల్ల ఈరోజు లలిత యిక్కడే సుఖంగా వుందని విని. చూడాలన్న ఆశక్తితో వస్తూ, కారు ప్రమాదానికి గురై, మూర్ఛిల్లి పడిపోయా. నన్ను ఎలాగో ఇల్లు చేర్చారనుకొంటా. లలిత నన్ను ఆ స్థితిలో చూచి వెంటనే శుశ్రూష చేయనారంభించిందనుకుంటా. తర్వాత విషయం మీకే తెలుసు- ఇంతలో మీరు రావడం లలితను అనుమానించి అన్యాయంగా అవమానపరచడం ఒక తృటిలో జరిగిపోయాయి. అప్పటికే మించిపోయింది. లలిత తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు, మిమ్మ నిందింపవద్దని నాకు వ్రాసిన వుత్తరంలో, వేడుకొంది. కారణం ఒకప్పుడు ఆమె జీవితంలో మీరు గొప్ప మహోపకారం చేశారట. సంఘాన్నెదిరించి తన్ను పునర్వివాహం చేసుకోవున్నారని. నాకు విశ్రాంతికావాలి. దేశపర్యటనకి బయలుదేరాను.★

మాట పట్టింపు!!

కథానిక

చంద్రశేఖర్ అప్పుడే కాలేజి నుండి యింటికి వచ్చాడు. వస్తూనే హడావిడిగ భార్య విజయను పిలిచాడు.

విజయా.......

ఆ......అన్న ప్రత్యుత్తరం లోపలినుండె.

ఏయ్ విజ్జీ..........అన్నాడు కొంచెం గట్టిగా

ఎందుకు.......

ఒక్కసారి ఇలాగ వస్తావా..........

ఎందు కంటుంటె...

అబ్బ, రమ్మంటుంటె

అబ్బ, అంత అర్థంలేమిటండీ? అంటు విజయ లోపల గదిలో నుండి డ్రాయింగ్ రూములోకివచ్చింది.

అర్థంలెమరి.... ఆలస్యం అమృతం విషం! అన్నారు.

హడావిడిచేయక అసలు విషయం చెప్పుదురూ!

ఆహా ఏమీలేదు మనం ఈరోజుపిక్చరుకు వెళ్తామా?

ఓస్ ఈమాత్రం దానికేనా అదేదో కొంప మునిగి పోయిందను కున్నాను నేను.

కొంపమునుగుతే మనం బయటఎలాఉంటాంచెప్పు!

చాల్లెండి విపరీతార్థాలు తీయమంటె మీతరువాతే గాని. అయినా ఈరోజు మీ స్నేహితులెవరు తటస్థ పడలేదా ఏమిటి జోడుగ వెళ్ళటానికి?

పడక పోవట ఏమిటి? పడ్డారు కాని వాళ్ళను తొందరగ విడిపించుకు వచ్చేశాను. ఈ శ్రీమతితో సినిమాకు వెళ్ళాలని అన్నాడు చలోక్తిగా.

ఎందుకంత అవస్థపడి వచ్చేశారు కాస్త బాతాఖాని వేసే రావాల్సిందే

ఇదిగో! ఇంత సేపు నేనేమైన భాషలో మాట్లాడు తున్నానా విషయం అంతా విని ఎందు కింత త్వరగ వచ్చేశారు అని అడుగుతావు.

ఇంకో భాషలో మాట్లాడటానికి మనకు వస్తేకదూ!

వచ్చినా, నీ కర్థం కానిభాష జోలికి పోననుకో!

ఓహోహో ఏమి అభిమానం ఏమి అభిమానం సముద్రంలాఉంది దరిలేకుండ.

నేనేమన్నా నీకలాగె ఉంటుంది కాని సిలుస్తే యింతే ఇలాగే కోరి పిల్లనిస్తామంటె ఏదో అన్నాట్ట, నీలాటి వాడే.

తోటి లెక్చరర్లతో వెళ్ళే అలవాటు కద ఈ రోజు నన్ను పిలవటం సమంజ సంకాదు అన్నాను న్యాయంగ.

ఏదో ఒకటి రెండు సార్లు కొలీగ్స్ రమ్మంటే వెళ్ళేను గాని. నెలకు కనీసం నాలుగైదు సార్లయినా నీతోనే కలసివస్తున్నాను. మొన్నను నారాయణ రావుతో వెళ్ళానసేగా మహోయిదైయి పోతున్నావు.

ఇదేమ అయిపోలేదు కాని.........

కానీలేదు గీనీలేదు వెళ్ళాల్సిందే అన్నాడు అధి కార పూర్వకంగ.

ఎక్కడికి అంది సీరియస్‌గ

రామాయణం అంతావిని రాముడికి సీత ఏమయిం దన్నట్లు సినిమాకు సినిమాకంటె ఎక్కడికంటా వేమిటి చెప్పింది మళ్ళీ చెప్పటం నా జన్మలో లేదు. నాక్లా

కుమారి వై. భాస్కరలక్ష్మి

సులో అయితే ఒక్కసారి కన్నా పార్డెన్ అంటె బయటకు పంపించేయటమే-అన్నాడు ఆత్మస్తుతిచేస్తూ.

ఎవరు, పిల్లలు మిమ్మల్నా లేక మీరు పిల్లల్నా, అంది చిలిపిగా.

డామిట్ నన్ను నన్ను వాళ్ళు పంపించెయ్యటానికి ఎన్ని గట్స్ ఉండాలి. నా ఘనత నీ కింక పూర్తిగ తెలియదు.

ఒద్దు, తెలిసినంత మట్టుకే ఎక్కువైంది. ఆత్మస్తుతి చేయడంలో....సిద్ధహస్తం అంది మెల్లగ.

వృథా కాలక్షేపం ఎందుకు త్వరగ బయలుదేరు అన్నాడు అసలు టాపిక్ కి వస్తూ.

మీరు పిలిచినప్పుడల్లా నేను రావాలి నేను పిలిచి నప్పుడు మాత్రం మీరు రారు అంది కొంచెం కన్విన్ అవుతూ.

తీరుబడిగ ఉన్నప్పుడయితే ఎందుకురాను, ఏదైనా పనిమీద వెళ్ళేటప్పుడో లేక పేపర్లుకరక్ట్ చేసేటప్పుడు అయితే ఎలాగ చెప్పు అన్నాడు.

అయితే యింతకీ ఏ పిక్చరుకి అంది.

వార్ ఎండ్ పీస్ కు అన్నాడు ఉత్సాహంతో.

ఛీ అంది విజయ,

ఛీ ఏమిటి ఎంతబాగుంటుందో తెలుసా అన్నాడు కళ్ళు కాస్త పెద్దవిచేస్తూ.

అనవసరం అంది నిర్లక్ష్యంగా విజయ.

చెప్పింది విను అన్నాడు బతిమాలే ధోరణిలో.

ఉహు వీల్లేదు పూనమ్ లో మంచి హిందీ పిక్చరు వచ్చింది. దానికి వెళ్ళాలి అంది

అబ్బ ఈరోజు "వార్ ఎండ్ పీస్" ఆఖరి రోజు విజ్జీ అన్నాడు ప్రాధేయ పూర్వకంగా.

పూనమ్ లో "దో అంఖె బారాహాత్" కూడ ఆఖరే వైగ అందులో లత పాడిన పాటలు అమోఘంగా ఉన్నాయట. ఒక జోలపాటకైతె నిద్ర వచ్చేసిందిట. ప్రక్కింటి కమలచెప్పింది అంది.

నిద్ర వచ్చేస్తే మిగతా సినిమా ఎలా చూచింది. మీ అంత తెలివి తేటలు నాకు లేకపోయాయి. ఆ ప్రశ్న వేయటానికి ?

చూడు వార్ ఎండ్ పీస్ టాల్ స్టాయ్ రచనలలో మాస్టర్ పీస్ అని చెప్పొచ్చు. పుస్తకం అంటేనే పడి పడిచస్తారు గదా అలాంటిది పిక్చరుగ వచ్చిందంటే చూచె తరుణం ఎవరు వదులుకుంటారు చెప్పు.

నేను చెప్పిన పిక్చరు ఉత్తమ చిత్రంగ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంది అంది

ఏదో పంతానికి వెళ్ళాలి అంటున్నావేకాని అసలు విషయం బోధ పరచుకోవు. అలాంటి పెద్ద దేశాలు యుద్ధాలు ఎలాగ ఉంటాయో తెలుసు కోవాలా? అసలు యుద్ధం అంటె ప్రత్యక్షంగ కాకపోయిన పరో క్షంగాయిన ఒక అయిడియా ఉండాలంటావా?

అయిడియా ఏమిటి నా మొహం కావలిసినంత ప్రాక్టికల్. ఎక్స్ పీరియంసే ఉంది. అయిన యుద్ధం చూస్తే ఆనందమా ఆహ్లాదమా. సినిమాకు వెళ్ళేది ఆ గంటయిన ఆనందంగ గడపాలని గాని ఏడవటానికి కాదుగఅంది మరికొంచెం సమర్థిస్తు.

ఆనందం ఆహ్లాదం లేకపోయిన లోకజ్ఞానంవస్తుంది అసలు నువ్వెప్పుడైన వార్ అండ్ పీస్ చదివేవా అన్నాడు.

క్లాసు పుస్తకాలు తప్ప మిగత అర్థమైన పుస్తకాలు చదివే దురలవాటు నాకులేదు అంది విసుగ్గా.

హతవిధీ ! అందుకే అమ్మాయిలు ఎంత చదువు కున్నా జనరల్ నాలెడ్జి సూన్యం బి. ఎ. చదివావు కద ఆ మాత్రం తెలుసుకోలేక పోతే ఎలా అన్నాడు పరిహాసంగ.

నేను లిటరేచర్ బి. ఎ. నుకాదు. నవకవులగూర్చి తెలిసి కోవటానికి.

ఓహో నువ్వు సైకాలేజి బి. ఎ. కాదూ. నీకెలా తెలుస్తుంది. అయిన సైకాలేజి కూడ ఒక సబ్జక్టెగా అన్నాడు కొంచెం మెల్లగ.

ఇదిగోమాటలు కాస్తజాగ్రత్తగా వాడటంమంచిది. అయిన ఫిజిక్స్ అనర్సుచదివిన మీరు సాధించిన దేమిటి అంది.

ఎంత మాట ! మేము లేందే ఈ జగమేలేదు అన్నాడు.

ఈ భూప్రపంచాన్ని మీ భుజాలమీదె పెట్టి మోస్తు న్నట్లు చెప్తున్నారె.

కాదుమరి ... ఆకాశంలోకి గ్రహాలనే పంపించెస్తు న్నాము. ఈ అవనిలో యాంత్రికంగ పనిచేసేదైన అదంతా మా చలవేఅనుకో అన్నాడు కాస్త కాలర్ మీదెకెత్తుతూ.

అలాగ గర్వపడవలసినది ఏ ఐన్‌స్టిన్‌లాటి మహాశయులోగాని మీలాంటి లెక్చరర్లు కాదు. ఐనా ప సబ్జెక్టు కుండెగొప్ప దానికే ఉంది. హెచ్చుతగ్గులు ఎంచటం బుద్ధిలేని తనం అంటాను.

అలాగ అనటం బుద్ధిలేని తనం అంటాను అన్నాడు.

ఈ మాటలే విజయకు వళ్ళుమండింది. ప్రతీ మాటలో ఎడ్డెం తెడ్డెం అంటాడు. ఎప్పుడు తనమాటె జరగాలంటాడు. అలాంటి అశక్తి ఎవరికిమాత్రం ఉండదూ ఈరోజు ఏమయిన సరే తనమాటె నెగ్గాలనుకుంది. శేఖర్ కూడ అదే పరిస్థితిలో ఉన్నాడు.

విజయా ఈ ఒక్కసారి నామాటవిందూ అన్నాడు నిశ్శబ్దన్ని భరించలేక.

ప్రతి విషయానికి మీ మాటె వినాలేమిటి? మన లాగే ప్రతివారు కూడ వ్యక్తిత్వం ఉన్నవాళ్ళు పది సార్లకొకసారైన వాళ్ళకోర్కె చెల్లిద్దాం అన్న భావం కొంచెం అయిన ఉండాలి. అలాటి ఉదాత్త స్వభావం మీజాతికేఉండదు. మిమ్మల్నని ఏం లాభం? అంది ఆవేశంతో.

ఇంక ఏమిటేమిటనాలో అనెసెయి అన్నాడు.

నేనెందు కంటాను అనేవరకు నాకేమిటవసరం?

ఎందుకంతకోపం నీకు అన్నాడు శాంతమూర్తిలా

వాకెందుకు కోపం ఎవరిమీద కోపం తెచ్చుకుంటె ఎవరూరుకుంటారు?

మరి కోపంలేకపోతే నా బంగారు విజయవి కదూ మరి సినిమాకు వెళ్దాం బ్రతి మాలు కుంటున్నాను అన్నాడు.

నన్ను విసిగించవద్దు అంది చికాకుగ.

ఈ ఒక్కసారె....

ఈ ఒక్కసారె అని నేను చెప్తున్నాను. అయినా మీ కంత బాధగ ఉంటె మీరు వెళ్ళగూడదూ మధ్యన నన్ను బాధపెట్టడం ఎందుకూ అంది.

నీకంపెనీ లేకపోతే నేను చూడలేను విజయా- అసలు విషయం తెలుస్తూ.

చూచిన అన్ని పిక్చర్లకు నన్ను తీసికెళ్ళినట్లె. మీరు వచ్చినా రాకపోయిన నేను ఈరోజు పూనమ్‌లో పిక్చరుకి వెళ్ళదలుచు కున్నాను. మా కమల అదే పిక్చరు మరొకసారి చూస్తుందిట. ఈ రోజు తనతో వెళ్ళాలి అంది.

ఈ మాటలే శేఖరానికి వళ్ళుమండింది. ఇంక బ్రతిమాలదలచుకోలేదు. కాని వ్యవహారం ఎలాగ జరుగుతే అలాగే జరుగుతుందని ఊరుకున్నాడు.

ఇంతలో, మీరు వస్తానన్నారుట మాఅక్కయ్యతో సినిమాకి వచ్చేమాటైతె రడీగ ఉండమంది అన్నాడు రాయబారం తెచ్చిన కమల తమ్ముడు. ఈ మాటతో సంతోష తరంగాలు విజయ ముఖంలో ఒకసారిగ నాట్యం చేశాయి. పదినిముషాలలో వస్తున్నానుఅంది

ఈ మాటతో శేఖర్‌కి టెంపరేచర్ మరి రెండు డిగ్రీలు హెచ్చింది. "వెళ్ళనా అని తనను అడగనైనా లేదు. అంతా తనే నిశ్చయించుకుంది. తనే అనవసరంగ ఆమెను బ్రతిమాలుతున్నాడు. వెళ్తె వెళ్ళని. తనుకూడ అనుకున్న సినిమాకు వెళ్ళి కుక్కకాటుకి చెప్పుదెబ్బలా బుద్ధి చెప్పాలి. తను సినిమాకు చెక్కేస్తె యింట్లో కాపు కూర్చుంటా ననుకుంది పాపం.

ఇంతలో విజయ ముస్తాబై వెళ్ళటానికి రడీ అయింది. వెళ్ళటానికి నిశ్చయించు కున్నావన్నమాట అన్నాడు గంభీరంగా.

నేనుకూడ వెళ్తున్నాను అన్నాడు డ్రెస్ అవటానికి ఉపక్రమిస్తూ.

తనుకూడ బయలు దేరుతున్నాడే యిద్దరూ వెళ్తె యిల్లు తాళం వెయ్యాలన్నమాట అనుకుంది. అయిన ఆ విషయం ఎక్కువ ప్రస్తావింప దలచుకోలేదు, వ్యవహారం ముదిరిపోయింది. ఇంతలో కమల వచ్చింది.

నేను వెళ్తున్నాను అన్నది విజయ శేఖర్‌తో.

సరి. అన్నాడు.

ఇద్దరు ఎవరికి వారే యమునా తీరే అన్నట్ట చెరొక త్రోవ అయ్యారు. త్రోవలో కమల విజయను అడిగింది. మీ వారుని కూడ రమ్మంటానన్నావుకదా నీవు ఒక్క దానివే వస్తున్నా వేమని. జరిగిన విషయ

మంతా చెప్పింది. టిక్కట్లు తీసుకుని తిన్నగా హాలు లోనికి పోయి కూర్చున్నారు. ఏవరిని సినిమా ఏమిటని అడగాలేదు, ఎవరూ చెప్పాలేదు. చివరికి వాల్ పోస్టర్ కూడ చూడలేదు. విజయ శారీరకంగా మాత్రం అక్కడ ఉంది మనస్సంతా శేఖర్ ని గూర్చి పర్యవేక్షణ చేస్తూంది. తీర సినిమా ప్రారంభ మయేసరికి అది ఎప్పటిదో పాత పడిపోయిన 'సీతారామజననం' హారి భగవంతుడా ఇది ఒకసారి చూశాము. హాయిగ వార్ అండ్ పీస్‌కు పోయిన బాగుండేది. ఇది ఎలాగ చూడటం ఇంటికివెళ్తే సిగ్గుచేటు! ముహూర్తం చూచుకుని యాత్రకు బయలు దేరినవాడిలా ఉంది తన వ్యవహారం.

శేఖర్ యింటి వద్దనుండి బయలుదేరి రోడ్డుమీద నిలుచుని నాలుగుప్రక్కల కలియజూచేడు. ఎవరైనా కనుపిస్తారేమోనని. అనుకున్నట్లుగ నారాయణరావు కనుపించేడు. హల్లో యిలాగ నిలపడ్డావు ఏమిటి సంగతి అని అడిగేడు ఏమిలేదు. అసలు విషయం సావకాశంగ మాట్లాడు కోవచ్చు పదపద అన్నాడు. మాట్లాడుటకు సినిమా హాలువద్దకు తీసికొనిపోయాడు నారాయణరావుని నిలబెట్టి తాను టిక్కెట్లు తీసుకొని త్వరత్వరగ వచ్చాడు.

రా వెళ్ళుదాం అంటూ పిలిచాడు.

ఇదేమిటోయి యీ సినిమాకా.

ఆఁ మరి వార్ ఎండ్ పీస్ నేను చూడలేదు కదుటోయి అన్నాడు.

అరెరె టిక్కెట్లు కూడ కొనేశావా. అది నిన్ననే వెళ్ళిపోయింది. ఈ రోజు నుండి "లంకాదహనం" అన్నాడు అక్కడ పోస్టరే చూస్తూ.

చచ్చాం బాబు అది ఎలా చూడటం అన్నాడు.

త్రోవలో అయిన అడిగావు గాదు అన్నాడు నారాయణరావు.

గత్యంతరం లేక ఇద్దరు మెల్లగ హాల్లోకి ప్రవేశించారు. ఇలా అని తెలిస్తె విజయతో వెళ్ళిఉందును. అన్యాయంగ అమాయకపు మనస్సు నొప్పించాను ఎంత బాధపడిందో. ఎంతో బాధపడక పోతె అంత సహాసానికి త్రోవతీయదు- అని పరిపరి విధములుగ బాధపడసాగాడు. ఇంతలో సినిమా ప్రారంభమైంది. మనస్సంతా విజయ కోసం తహతహ లాడుతూంది. ఒక మూల రావణాసుడు పద్యాలు దంచేస్తున్నాడు. జోరుగ అనిపించింది శేఖర్ కి. సగం సినిమా ఉండగానే లేచి వచ్చేశాం.

ఇంటికి వచ్చేసరికి విజయ ఇంకా వేంచేయలేదు. చాలసేపు నిరీక్షించాడు. హిందీ పిక్చరుకదా యింతసేపేమిటి చెప్మా అనుకున్నాడు. మనస్సులో ఆందోళన ప్రారంభమైంది. ఇంతలో విజయ మెల్లగ దయ చేసింది. ఇంత ఆలస్యం ఎందుకయిందని అడుగుదామనుకున్నాడు. కాని అభిమానం అడ్డుకుంది. విజయ కూడ చాల ముభావంగ ఉంది. భోజనాల కార్యక్రమం అంత సాఫీగ జరిగిపోయింది. కాని అంత సైలెంట్ పిల్మ్ లా.

♦ ♦ ♦

మర్నాడు ఉదయం యధాలాపంగ కాఫీటిఫిన్ జరిగింది. అప్పుడుకూడ ప్రస్తావించుకోలేదు. ఒకరి విషయం ఇంకొకరు తెలుసుకోవాలనే కుతూహలం లేకపోలేదు. కాని తీగెకదుపుతె డొంకంత కదిలినట్లు ఎవరి గుట్టెక్కడ బయలుపడుతుందేమోనని భయం. విజయ డ్రాయింగ్ రూమ్‌లో బొమ్మల మన్నుదులుపుతూంది. ఇంతలో నారాయణరావు ప్రవేశించాడు.

ఏమండి చంద్రశేఖర్ ఉన్నాడా అని అడిగాడు గుమ్మందగ్గర నుండె.

ఉన్నారు. రండి అని లోపలకు ఆహ్వానించింది.

ఏంచేస్తున్నాడు అన్నాడు.

స్నానం చేస్తున్నారు. ఇప్పుడే వచ్చెస్తారు అంది.

వచ్చి కూర్చొని, కాలక్షేపానికి బల్లమీద మేగజైను తిరగవెయ్యటం ప్రారంభించాడు పుస్తకం చేతిలో ఉందన్న మాటగాని ఆవలింతలు తరంగాలుగ వచ్చెస్తున్నాయి నారాయణరావుకి.

ఇదేమిటి ప్రొద్దుట ఎనిమిది గంటలైన నిద్రమత్తు గానే ఉందా అంది లౌక్యంగ.

ఆవలింతలుకాక మరేమిటి బంగారులాంటి నిద్ర పాడుచేశాడు. మహానుభావుడు అన్నాడు.

ఎవరు? అంది కుతూహలంగ.

మరెవరు మీ శ్రీవారు.

ఎందుకూ అంది ఉత్సాహంతో.

ఏముంది ఆవదం వంటి సినిమాకు యీడ్చుకు పోయాడు.

అదేమిటి అంత ఘనంగ చెప్పుకున్న వార్ అండ్ పీస్‌కు గాదూ మీరు వెళ్ళింది.

అది మొన్ననే వెళ్ళిపోయింది, ఎందుకూ పొందని లంకాదహనానికి వెళ్ళాం. ఇంక అందులో రావణాసుడు ఉః అంటె పద్యం ఆః పద్యం చెవులకున్న తుప్పు వదలిపోయింది.

ప్రక్కగదిలో బట్టలు వేసికొంటున్న శేఖర్ చెవులో ఈమాటలు పడ్డాయి. హడావిడిగ బయటకు వచ్చి ఎంత సేపయిందోయి వచ్చి, అన్నాడు టాపిక్‌ని కాస్త డైవర్ట్ చేసే ధోరణిలో

విజయ సంతోషానికి అంతులేకపోయింది. శేఖరం గాశర చూస్తె నవ్వాగలేదు. ఇంకా ఏడిపించాలనుకుంది. అసలే టాల్‌స్టాయ్ రచన అందులో షెక్సిపియర్ అంటు మాటలా అంది నారాయణరావుతో శేఖర్ నుద్దేశించి.

చెప్పేదేదో సూటిగ చెప్పరాదు ప్రక్కవాళ్ళెం చేస్తున్నారో అని పరిహాసంగా చూడటం దేనికి అన్నాడు శేఖర్ నారాయణరావుతో.

ఎవరికి ఇష్టం వచ్చినట్లువారు మాట్లాడతారు. అయిన మాట్లాడేవారు ఎవరివేపు చూస్తున్నారో. మనం చూడకపోతే మనకెలా తెలిసింది వారు మన వేపే చూశారని అంది చమత్కారంగా.

కాఫీ త్రాగేవా అన్నాడు సందట్లో కాఫీ యివ్వటం మరచిపోయిన విజయకు జ్ఞాపకం చేస్తూ.

ఇంట్లో వ్యవహారం ఎలావున్నా అతిథి సత్కారానికి లోపం చేయకూడదని కాఫీ తేవటానికి వెళ్ళింది విజయ.

ఏమిటోయి వ్యవహారం అన్నాడు నారాయణ రావు అయోమయంగా.

ఏముంది నిన్న నేను ఇంగ్లీషు పిక్చరుకు వెళ్ళాలనుకున్నాను. ఆవిడ హిందీ పిక్చరు అంది. అనుకోవటం తడవుగ మాట నెగ్గించుకోవాలనె పంతం ఇరువురిలో జనించింది. తను మాత్రం అన్న ప్రకారం చూచింది. నేను వార్ అండ్ పీస్ అనుకుంటె నావ్యవహారం ఇలా ఏడ్చింది. అందుకే ఆవిడాకా ఆనందం అన్నాడు.

ఏ హిందీ పిక్చరుకీ అన్నాడు నారాయణరావు.

దో ఆంఖే బారాహాత్....

అది మొన్నటి తోనేసరి నిన్నటి నుండి ఏదో తెలుగు పిక్చరు వచ్చింది కదుటోయి అన్నాడు కూపీ తీసిన డిటెక్టివ్‌లా.

ఆః అన్నాడు ఆశ్చర్యానందాలతో.

ఈ లోగ విజయ కాఫీ కప్పులతో హాజరైంది.

హిందీ సినిమా అంటె మాటల అదేమోగాని వాళ్లు తెలుగులోనె మాట్లాడెశారు.

పైగా లత జోలపాట ఆహాహా అద్భుతం అన్నాడు శేఖర్. విజయ వినాలన్నట్లు.

విజయ మనస్సులో ఆందోళన ప్రారంభమైంది. తన రహస్యం బయలుపడి పోయింది. కాని ఏం? చేస్తుంది? ఇంకంత ఏమేమో వర్ణించేస్తున్నాడు శేఖర్.

విజయకు కోపం వచ్చింది. మరె వెక్కిరించక్కరలేదు అంది ఉడుక్కుని.

నీ మాటలేంగాను అన్నాడు.

అయితే నా యెదురుగ నీమ అనొద్దు.

నేను నారాయణరావుతో చెప్పా.

నేను ఆయనతోనే అన్నాను....

నారాయణరావు నోట్లో పచ్చివెలక్కాయ పడింది. వీళ్లిద్దరి వ్యవహారం చూస్తె ఎటు చెప్పితే ఏంగొడవొస్తుందో అనే భయం.

ఏదో వడ్లగింజలో బియ్యపుగింజ దీనికి కింత గొడవేమిటోయి అన్నాడు. సంధి కుదర్చటానికి వచ్చిన సంజయుడిలాగా.

నేనేం గొడవ చేయలేదు అన్నాడు నేరం అంతా విజయదే అన్నట్లు.

నేనేం అంతకన్నా చెయ్యలేదు.

తాను ఇంక జోక్యం కలుగజేసికుంటె వ్యవహారం ముదురుతుందని ఏమిటోయి గోరంత విషయం కొండంతగ జేయటం అన్నాడు పలాయన మంత్రానికి ఉపక్రమిస్తూ.

నేను యింత సర్దుకున్న ఆవిడ సర్దుకోదోయి.

చూద్దాంగా రేపు! అన్నాడు నారాయణరావు.

చూడటమేమిటి మా సంగతి ఎప్పుడు ఇలానే ఉంటుంది. అంది విజయ.

వేడిమీద అలాగే అంటారు. ముందు అన్నాడు పెద్ద అనుభవం సంపాయించినట్లు నారాయణరావు.

♦ ♦ ♦

మర్నాడు యధాలాపంగా నారాయణరావు జంక్షన్‌లో నిలబడ్డాడు. ఎవరో యువదంపతులు అతనిదృష్టిలో పడ్డారు, ఆనందంగా మాట్లాడుకుంటూ వస్తున్నారు. అరెరె మరెవరు గాదు విజయ చంద్రశేఖరులు! ప్రయాణం ఎంతవరకి తెలుసుకో వచ్చా అన్నాడు చలోక్తిగ నారాయణరావు.

సినిమాకు అన్నారు వెంటనే.

రాజీ ఎలా కుదిరింది అన్నాడు పరిహాసంగ.

తన్నే అడుగు అన్నాడు క్రీగంటి చూపుతో విజయను చూస్తు శేఖర్.

ఉహు. ఆయన్నే అడగండి అంది విజయ సిగ్గుతో

సరి ఇద్దర్ని అడుగుతున్నాను! అన్నాడు నారాయణరావు.

నవ్వు చెప్పు అన్నాడు శేఖర్.

తనకు ఏమి తెలియదన్నట్లు చిరునవ్వు నవ్వింది విజయ.

★

ఆంధ్ర మహిళా సభ నర్సింగుహోము అడయారు తోటకు, ఎగ్రిహార్టికల్చరల్ సొసైటీవారి బహుమతులు యీ క్రిందివి లభించాయి.

1. నర్సింగుహోము, ఆస్పత్రుల తోటలకు మొదటి బహుమతి. —ఉమ్మడియార్ కప్పు
2. మేజా అలంకరణ (పశ్చిమ రీతిన) మొదటి హుమతి —వెండికప్పు
3. పూజా పుష్పాలకు రెండవ బహుమతి —పతకం
4. మేజాఅలంకరణ (దేశీయరీతిన) రెండవ బహుమతి —పతకం
5. బాగుగా అమర్చిన పూలకుండీకి మూడవ బహుమతి —పతకం

మహిళా సమాజాలు

గుడివాడ

గుడివాడ పట్టణ మహిళా సంఘ కార్యాలయమైన కస్తూర్బాభవనములో పట్టణ మహిళలచే భారతరిపబ్లిక్ దినోత్సవము జరుపబడినది.

ఉ 8 గం॥లకు సంఘ అధ్యక్షురాలచే పతాకవందనము జరుపబడినది. శ్రీమతి కె. భగీరధిగారి అధ్యక్షతన సభ జరుపబడినది. శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, జి. హైమవతిగారు, జాహ్నవిగారు ఈ దినోత్సవ ప్రాముఖ్యతను గూర్చి వివరించిరి.

సాయంత్రము, 4½ గం॥ లకు బందరు వాస్తవ్యులైన కె. మహాలక్ష్మిగారి గానసభ జరిగినది. శ్రీమతులు ఎ. రాజేశ్వరిగారు, ఎ. జయప్రదగారిచే కానుకగా నివ్వబడిన రజితపాత్రలను, సంఘ అధ్యక్షురాలు ఈడ్పుగంటి బాపమ్మగారు, వారికి బహూకరించిరి. కార్యదర్శిని అయ్యంకి సీతారాం సంఘం తరఫున వారికి అభినందనలు తెల్పిర.

ఇరకం

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట తాలూకా ఇరకం ద్వీప గ్రామంలో 26-1-950 తారీకు ఉదయం 7 గంటలకు గ్రామ ప్రాథమికా సంఘాధ్యక్షుడు. డాక్టరు జి. ఆర్. కన్నయ్యనాయుడుగారి అధ్యక్షతన కేంద్రసమాజ కల్యాణ బోర్డువారు బాలసంఘమువారు జాతీయ పతాకముతో వూరేగింపువచ్చి పంచాయితీబోర్డు ఉపాధ్యక్షుడు శ్రీ. ముత్తుగోవిందుస్వామి మొదలిగారు పతాకము యెగరవేసినారు. శ్రీ నటేశగురుక్కులు స్వరాజ్యదిన ప్రాముఖ్యతను ప్రసంగించినారు—పంచాయితీబోర్డు వారి వల్ల హరిజనమరియు బీద బాలబాలికలకు పలకలు పుస్తకములు యిచ్చినారు. కేంద్రసమాజ కల్యాణబోర్డువారు పప్పరమిట్లు యిచ్చినారు.

ఆ రాత్రి 7 ఘంటలకు బాల్వాడి తరగతి బాలబాలికలు బాల సంఘసభ్యులు గ్రామసేవిక శ్రీమతి వి. సుశీలాగారి ఆధ్వర్యాన నాటకము ప్రదర్శించి నృత్యమును చక్కగా నటించినారు.

గుంటూరు

జనవరి 26 వ తేదీన భారత్ సేవక్ సమాజ్. మహిళా శాఖ. గుంటూరువారు రిపబ్లిక్ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నడపారు. ఉదయం 10 గం॥ లకు.

మహిళా సమాజ కన్వీనరు, శరణాలయ కార్యదర్శినీ అయిన శ్రీమతి జాగర్లమూడి గంగా చంద్రమౌళిగారు ఆహ్వానితులకు స్వాగతం చెప్పారు. జిల్లా పోలీసు సూపరింటెండెంటుగారి సతీమణి శ్రీమతి మహాలక్ష్మి రాజేశ్వరన్ గారు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ మహిళా సమాజంవారు నిర్వహిస్తున్న వికలాంగుల శరణాలయ లలితసంగీత శాఖ బిడ్డలు జాతీయ గేయాలు గానం చేశారు. ఆహ్వానితులకు బిడ్డలకు పండ్లు పంచిపెట్టారు. బిడ్డలు బుర్రకథ ప్రదర్శనం ఇచ్చారు. "జణ గణ మన" జాతీయ గేయంతో కార్యక్రమం ముగిసింది.

హైదరాబాదు

జనవరి 26 వ తారీఖున హైదరాబాదు ఆంధ్రమహిళా సభ హాస్టలులో "రిపబ్లిక్ డే" ఉత్సవాలు జయప్రదంగా జరిగాయి. ఈ హాస్టలులో ఉన్న ప్రాంతీయ చేతిపనుల శిక్షణ కేంద్ర విద్యార్థినిలు ప్రార్థనగీతం పాడేరు. శ్రీమతి అమ్మన్న రాజాగారు జాతీయ పతాకం ఎగురవేశారు.

శ్రీమతి పట్టాభి రామారావుగారు, శ్రీమతి జస్టిస్ చంద్రారెడ్డిగారు, శ్రీమతి ఓబులరెడ్డిగారు, శ్రీమతి సీతాకుమారిగారు శ్రీమతి కందా శివశంకరంగారు వగైరా పెద్దలు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

అంతా కలిసి "సూత్రయజ్ఞం" జరిపేరు. శ్రీమతి అమ్మన్న రాజాగారు ఈ సన్దర్భమున్న "రిపబ్లిక్ డే" యొక్క అంతరార్థం వివరించారు. దేశ స్వాతంత్ర్యం మన నాయకుల త్యాగాల ఫలితమన్నారు. స్వాతంత్ర్య సాధనాంతరం దేశ ప్రజల పురోభివృద్ధికి అపూర్వ కృషి జరుగుతోందని ప్రజల సర్వతోముఖాభివృద్ధికి అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని చెప్పారు.

ఈ స్వాతంత్ర్య సమరంలో స్త్రీలు చాల ముఖ్యపాత్ర వహించారని, ఇంకా చాలమంది స్త్రీలు దేశ సేవకు ముందుకు రావాలని హెచ్చరించారు. స్త్రీలు దేశాన్ని కూడ పెద్ద సంసారంగా భావించి దేశాభివృద్ధికి ఎంతటి త్యాగమైన చేయటానికి సంసిద్ధురాలై వుండాలని ప్రోత్సాహించారు. మనదేశంలో శ్రీమతి ఇందిరాగాంధి, శ్రీమతి దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ లాంటివారు తేజోమూర్తులై, యువతులకు మార్గదర్శకులౌతున్నారని అట్టివారిని అనుసరించాలని అన్నారు. ప్రతి భారత స్త్రీ తన దేశానికి సేవ చేయుటానికి దీక్ష వహిస్తానని ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఇదే తాము ఇచ్చే "రిపబ్లిక్ డే" సందేశమని అన్నారు.

ఆంధ్రమహిళాసభ స్త్రీ జనాభ్యుదయానికి సేవ చేస్తున్నదని, ఇలాంటి సంస్థలు మన దేశంలో యింకా అనేకం అవసరం అని చెప్పారు.

ఆంధ్రమహిళాసభ కార్యదర్శిని శ్రీమతి కె. సుగుణమణిగారు వందన సమర్పణగావిస్తూ శ్రీమతి అమన్న రాజాగారిచ్చిన సందేశాన్ని అంతా ఆచరణలో పెట్టాలని కోరారు.

పిల్లలకి "స్వీట్సు" పంచిపెట్టాక "జన గణ మన" గీతంతో ఆనాటి కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.

భీమవరము

భీమవరం పట్టణ మహిళా సంఘమువారి ఆధ్వర్యాన్న సరోజినీ గ్రంథాలయ భవనంలో బహిరంగ సభ జరిగింది. సభకు శ్రీమతి తాడిమళ్ళ వెంకట రమణాదేవిగారు అధ్యక్షత వహించారు. శ్రీమతి మోచర్ల సుబ్బలక్ష్మిగారు ఉపన్యసించారు. నేటి మహిళలు సరోజనీదేవిని ఆదర్శంగా తీసుకొని రాజకీయ రంగంలోనూ, సాహిత్య రంగంలోనూ ముందంజ వేయాలని ఆమె ఉద్బోధించారు. సరోజనీదేవి మీద ఆమె రచించిన గేయం చదివారు. కుమారి లక్ష్మి కల్యాణిగారు మరికొందరు మహిళలూ పాటలు పాడారు. టి. లక్ష్మిగారు గ్రంథాలయ కార్యదర్శిని కూడా మాట్లాడారు. మహిళాసంఘాధ్యక్షురాలు శ్రీమతి సాలగ్రామం జయారామారావుగారు వందన సమర్పణ చేశారు. సర్వ ప్రియ సమగ సాధ్వి సరోజనీ జయంతి జయప్రదంగా జరిగింది.

తిమ్మాపురం

ఈ గ్రామ సంక్షేమ కేంద్రపు ఆర్గనైజరు గా ఉన్న కుమారి ఎస్. శేషమ్మ గారు పెనుగొండకు బదిలీ చేయబడిన సందర్భములో వారి గౌరవార్థము స్థానిక మహిళా సమాజమువారిచే విందు యేర్పాటు చేయబడి, ఫోటో తీయబడినది. తరువాత శ్రీమతి పి. ఈరమ్మగారి అధ్యక్షత జరిగిన సమువేశములో పలువురు ఆమెయొక్క సేవా గుణములను, ఆమెయొక్క పట్టుదల, సహన గుణములను ప్రశంసించి ఆమె వచ్చిన పిదప ఈ గ్రామములో కుట్టుమిషను కొనడము- ఎంబ్రాయిడరీ వగైరా కుట్టుపనులలో సమాజ సభ్యులు సాధించిన అభివృద్ధికి ఆమెను అభినందించిరి. సమాజము తరఫున ఆమెకు ఘనమగు వీడ్కోలు యివ్వబడెను.

కోరుకొల్లు

భీమవరం తాలూకా కోరుకొల్లు గ్రామములో శ్రీ అన్నపూర్ణాదేవి మహిళాసంఘమువారి యాజమాన్యమున శ్రీమతి ముదుండి చంద్రకాంతమ్మగారి అధ్యక్షతను సభ జరుపబడి 113 సంవత్సరములు వయస్సు శతివృద్ధులయిన ప్పటికీ కాంగ్రెసు సేవ చేస్తున్న శ్రీమతి కోటపర్తి కనకమ్మగారిచే అంబరుచరఖా శిక్షణకేంద్రము ప్రారంభింపబడెను. అంబరుచరఖా ప్రాముఖ్యతను గురించి గ్రూపు ఆర్గనైజరు శ్రీ కొడాలి వెంకటేశ్వర్లు, అంబరుచరఖా ఇనస్పెక్టర్సు శ్రీమతి జంపన చంద్రమ్మగార్లు మాట్లాడిరి.

శ్రీ అన్నపూర్ణాదేవి మహిళా సంఘము ప్రథమ వార్షికోత్సవము శ్రీమతి చంద్రమ్మగారి అధ్యక్షతను జరుపబడి సంఘ కార్యదర్శిని శ్రీమతి శ్రీగిరి రత్నమాలగారిచే వార్షిక నివేదిక సమర్పింపబడి ఆమోదింపబడెను. సంఘము స్థాపించిననాటినుండి జరిగిన కృషినిగురించి సంఘాధ్యక్షురాలు శ్రీమతి మంతెన లీలావతిగారు మాటలాడిరి. మహిళాసంఘముల ప్రాముఖ్యతను గురించి, అవిచేయుచున్న కృషిని గురించి శ్రీమతులు గోకరాజు వెంకాయమ్మ, పి. సూర్యకాంతమ్మ, దశ భాషాప్రవీణ శ్రీ శర్మ, శ్రీ అప్పారావు శ్రీ టి. వెంకన్న మున్నగు ప్రముఖులు మాటలాడిన పిదప అల్పాహార విందులొసంగబడి కార్యదర్శి సభాభివందన ములతో సభ ముగింపబడెను.

గుంటూరు

భారత్ సేవక్ సమాజ్, మహిళా శాఖ, గుంటూరు వారిచే నడుపబడుచున్న వికలాంగుల శరణాలయ, విద్యాలయ తృతీయ వార్షికోత్సవములు ఈ నెల 8 వ తేదీ సాయంత్రం 5-30 గం లకు శ్రీ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్. యం. యల్. ఎ. గారి అధ్యక్షతన అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సంస్థ వ్యవస్థాపకురాలయిన శ్రీమతి ఆవుల జయప్రదాసాంబశివరావు గారు ఆహూతులకు స్వాగితం పలికారు. శరణాలయ బాలికా బృందంవారి ప్రార్థనాగేయంతో కార్యక్రమం ప్రారంభ మయింది. గుంటూరు అడిషనల్ జిల్లాజడ్జి శ్రీ యం. రామమూర్తిగారు సభా ప్రారంభం చేశారు.

అధ్యక్షుడు శ్రీ హరిశ్చంద్ర ప్రసాద్ గారు ప్రసంగిస్తూ, ఆదర్శపూరిత కార్యక్రమాన్ని దృష్టియందుంచుకొని ఈ సంస్థ వికలాంగుల శరణాలయ, విద్యాలయములను కడు సమర్థతతో నిర్వహిస్తున్నందుకు అభినందిస్తూ ఇతోధికంగా తమ సహాయ సానుభూతులు ఈ సంస్థకు సర్వదా లభించ గలవని వక్కాణించారు.

జీవనోపాధికి తగు మార్గములు కలిగించ గలదని ఆశిస్తున్నా మన్నారు. కార్యదర్శి శ్రీమతి జాగర్లమూడి గంగా చంద్రమౌళి వార్షిక నివేదికను సమర్పించిరి. శ్రీయుతులు పి. వీరయ్య చౌదరి. వై. వి. సుబ్బారావు కె. నరశింగరావు, ప్రభృతులు సంస్థ సమర్థతతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సమీక్షించారు. విద్యాంశాఖ ప్రాంతీయ డైరక్టరు శ్రీమాధవపెద్ది నాగేశ్వరరావుగారు అంధుల పాఠశాలను అభివృద్ధి చేసే సూచనలిచ్చారు. ఈ ఉత్సవ కార్యక్రమం జయప్రదంగా జరగాలని పండిట్ నెహ్రూ శ్రీ బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, ఆంధ్రప్రదేశ గవర్నర్, విద్యాంశాఖామాత్యులు శ్రీ పట్టాభి రామారావు. శ్రీ చంద్రారెడ్డి, శ్రీమతి ఎ. సి. కృష్ణారావు. శ్రీ గుమ్మరూరి సత్యనారాయణగార్లు పంపిన శుభ సందేశములను శ్రీ బూర్గుల రామమూర్తి చదివి వినిపించారు.

ఆదిమవాసుల చిత్రలేఖనం

కె, దివ్యజ్ఞాన సరోజినీదేవి

క్రీ. పూ. ఇరవై వేల సంవత్సరముల నుండి క్రీస్తు శక ఆరంభము వరకుగల మధ్య కాలము నాటి చిత్రకళ ఆదిమ చిత్రకళగా పేర్కొన బడు చున్నది.

ఆదిమవాసులు ఈ అదిప్రాచీన చిత్రకళకు కర్తలు. కొందరికి ఆదిమ వాసులనగా అనాగరికులనెడి అభిప్రాయమున్నది. కొందరి ఆదిమవాసుల నాగరికతను ఈ నాటి నాగరికతతో సరిపోల్చిన మన విషయము నందుగాని నైతిక సాంఘిక విషయములందుగాని, శాస్త్ర విషయములందుగాని. శిల్పాది సాంకేతిక విద్య లందుగాని. అనాగరికులుగా ఏ మాత్రము కనబడుట లేదు. కావున ఈనాటి చరిత్రకారులు ఆదిమవాసులను అనాగరకులుగా భావింపరాదు. కాని వారి నాగరికత మన నాగరికతతో సరిపోల్చిన ఈ నాటి నాగరికతకన్న ఆనాటి నాగరికత ఒక్కపాలు తక్కువవుండుటచే వారు ఆదిమ వాసులుగా నిలవబడు చున్నారని అభిప్రాయ పడుచున్నారు. ఈ విధముగా ఆదిమవాసులు అనే పదమునకు అర్ధము చెప్పుటను ఎంత కష్టతరమో వారి 'చిత్రకళ'నగా నేమో చెప్పుటకూడ చాలా కష్టము.

'ఆది' అను పదం ఏ పదార్థము యొక్క గాని ప్రాథమిక దశను తెలుపుటకే వాడుదురు గావునను ఆ పదార్థము ఆ ప్రాథమిక దశలో సర్వసామాన్యముగా మోటుగాను. అసంపూర్ణముగానూ వుండును గావుననూ, పలువురు అదిప్రాచీన చిత్రకళ మోటుగా నుండుననియు ఆదిమ వాసులకు శిల్పాది సాంకేతిక విద్యలు తెలియక పోవుటయే యిందులకు కారణ మనియు అభిప్రాయ పడుతున్నారు. కాని యిందు ఏ మాత్రము నిజములేదు, ఆనాటి చిత్రకారులు వృక్ష జంతు జాతులనుండి గైకొని ఉపయోగించిన వర్ణములు, చిత్రించుటకు వాడినరాయి, దంతము, ఎముక కట్టె, మట్టి, లోహాది వస్తుసముదాయములు, ఆనాటి చిత్రకారులకు శిల్పాదివిద్యలందుండిన నైపుణ్యమును చెప్పకనే చెప్పుచున్నవి.

ఆదిమవాసులు తమ వేషభాష లందుగాని. తాము చిత్రించు చిత్రములందుగాని అనవసరమైన వివరముల జోలికి పోలేదు. వారు శరీర శుభ్రతకు కావలసిన వస్త్రములనే ధరించెడివారు. ఆ విధముగానే వారు చిత్రించు నప్పుడు సైతము ఆ వస్తువుయొక్క ప్రతి భాగము చిత్రించెడి వారుగాదు. ఇదే ఆదిప్రాచీన చిత్రకళంగలి ముఖ్యాంశము. అందుచేతనే వారు పక్షిరాజైన గ్రద్దను చిత్రించునప్పుడు వాడైన దాని ముక్కును, భయంకరమైన దాని కాలిగోళ్ళనూ మాత్రమే చిత్రించెడివారు.

కాని కొన్ని కొన్ని ఆదిప్రాచీన చిత్రకళలు పైచెప్పబడిన దానికి పూర్తిగా భిన్నాంశములు కలిగి యున్నవి. అట్టి చిత్రములను చిత్రకారులు చిత్రించునప్పుడు ఆ పక్షినిగాని, జంతువును గాని. (వారెక్కువగా జంతు చిత్రములనే చిత్రించెడివారు. శస్త్రవైద్య చేసి) చూసినట్లు వాని శరీరములందుగల ఎముకలు, కండరములు మొదలగు వివిధ భాగము శాస్త్రజ్ఞుడు చిత్రించినట్లు చిత్రించెడివారు.

సాంకేతిక చిత్రీకరణ ఆది ప్రాచీన చిత్రకళ యొక్క మరియొక లక్షణము.

ఆ రోజులలో చిత్రలేఖనమునకు అంత విశిష్ట స్థానము లభించుటకు ఆ నాటివారికి కేవలము అందువుండే మమతేగాదు. చిత్రలేఖనము ఆనాడు సంఘానికి అనేక విధాల సహాయకారిగా వుండేది.

ఆదిమవాసులకు ప్రప్రథమముగా లిపి తెలిసి యుండక పోవటముచే వారు తమ భావములను వ్యక్తపరుచుటకుగాని, తమ చరిత్రను తమ తరువాత తరములవారికి తెలియ జేయుటకుగాని చిత్రములనే వాడెడివారు. ఈ పద్ధతి ఎక్కువగా ఈజిప్టు, చైనాలలో వాడుకలో వుండేడది. ఎస్కిమో వనితలు బాలికలు కథలు చెప్పటానికై ఆ కథలను నేలమీద బొమికతో చిత్రరూపమున చిత్రించెడివారు.

అనేకవేల సంవత్సరముల నుండి చిత్రకళలో ముఖ్యస్థానమును ఆక్రమించు కొన్నది. హైందవ మతము. క్రీ. పూ. మూడు వేల సంవత్సరముల కాలము నాటికే చిత్రకళలందు ఒక విశిష్ట స్థాన మాక్రమించు కొన్నది. బౌద్ధమతము క్రీ. పూ. మూడవ శతాబ్దము నుండి క్రీ. పూ. పదునెనిమిదవ శతాబ్ద ప్రారంభము వరకు పలు దేశముల చిత్రకళలందును ఒక విశిష్టస్థాన మేర్పరచు కొన్నది. క్రైస్తవ మతముకూడ చిత్రలేఖనమందు రెండువేల సంవత్సరముల కాలము ఏకఛత్రాధిపత్యము వహించినది. బాబిలోను, అసరియా ఈజిప్టు, గ్రీసు, మెక్సికో, మధ్యఅమెరికా, కొలంబియా మొదలైన దేశముల చిత్రకళలందును మతము చోటు చేసుకొన్నది. ఆ విధముగానే ఆది ప్రాచీన చిత్రకళందును మతమునకు ఒక ప్రధాన పాత్రకలదు. కాని ఆ నాటి ఆదిమవాసుల మతానికి, ఈ నాటి మతములకు చాల భేదమున్నది. ఆ నాటివారి మతము మంత్ర యింద్రజాలములతో కూడుకొని యుండెడిది. వారు పూజ, బలి, నృత్యము, అనుకరణ, రేకలతో కూడిన పాటలు మొదలగు అట్టహాసములతో ఆ దేవతలను పూజించెడివారు. ఇట్టి అట్టహాసములకు చిత్రకళంతో తోడ్పడేది. ఇట్టి పూజలతో పాల్గొనెడి వారందరు, తమ ముఖములకు కృతిమ ముఖములను తగిలించు కొని, దేవతలకు, దెయ్యములకు రూపములు కల్పించి పూజించెడివారు. వీటన్నిటికి చిత్రలేఖనము మిగుల వసరము కదా!

ఆ కాలమున దైవ ప్రతిమలకు దైవత్వము కలుగ చేయుటకై ఆ ప్రతిమలకు కొన్ని అలంకరణలు చేసెడి వారు. పశ్చిమ ఆఫ్రికాలో అట్టి ప్రతిమలకు కొన్ని వర్ణములు పూసినగాని అవి దైవ ప్రతిమలగా పరిగణింప బడేవికావు. అదే విధముగా టిబెట్టు, చైనాలలో బుద్ధుని, బోధిసత్వుని విగ్రహములకు కనులు, నోరు వర్ణములతో చిత్రించినగాని ఆ విగ్రహము బుద్ధుని విగ్రహముగా పరిగణింప బడదట.

అమెరికా ఆదిమవాసులు తమ కుల గోత్రములను తెలుపుటకై తమ శరీరముల మీద పలువర్ణములతో మృగముల, సాంకేతిక చిత్రములను చిత్రించు కొనెడి వారు. ఆ నాటి ఆదిమవాసు లెన్నడు జంతువులను తమకన్న హీనులగా భావించే వారు కాదు. పైగా వాటి వేగమును, బలమును, యుక్తిని ఎంతో మెచ్చుకొని వాటిని అనుకరించుటకు ప్రయత్నించెవారు. తత్ఫలితమే వారి శరీరముల మీదగల వివిధ జంతువుల చిత్రములు.

ఆ కాలమునందు కూడ చిత్రముల నిచ్చి పుచ్చుకొను వ్యాపార ముండెడిదే, కొందరు చిత్రకారులు జీవితావసరములైన వస్తువుల కొనుగోలుకై తమ చిత్రములను యిచ్చి వేసెడివారు. సాధారణముగా కొన్ని సంవత్సరములపాటు ఒక చోటనే వుండెడి వారు గాదు. అందుచే వారెప్పుడు తమకు ఉపయోగపడే సామాన్లను, సులభముగా మోసుకు పోగల సామాన్లనే వుంచుకొనెడివారు. అందుచేతనే అది ప్రాచీన చిత్రకళ కేవలము అందమైన వస్తువుల చిత్రీకరణకు ఉపయోగపరచ బడినది.

కాని అంతమాత్రముచే ఆదిమవాసులు కేవలను చిత్రకళను తమ అవసరములు తీర్చుకొనుటకె వాడిరని భావించుట సమంజసము కాదు. ఆఫ్రికాలోని నీగ్రోలలోని ఒక తెగవారు కేవలము చిత్రకళ కోసరమే చిత్రములు వేసెడివారట. వారు చిత్రించిన వస్తువులు వారికి మరియే విధముగా ఉపయోగపడేవి కావట. పండుగ రోజులలో ఆ చిత్రకారుడు తన చిత్రములన్ని బైటకిడిసి, దుమ్ముదులిపి వాటినిచూస్తూ కూర్చుని ఆనందించేవాడట.

ఆదిమవాసులందు స్త్రీ పురుషుల కిరువురకును చిత్రకళలందు ప్రవేశ ముండెడిది. స్త్రీలు మృణ్మయ పాత్రలు మొదలగు వాటిపై చిత్రించెడివారు. విగ్రహములను పురుషులు చేసెడివారు. ఆ నాడు చిత్రలేఖనముకు అవసరమైన వస్తువులు ఈనాటివలె సులభముగా దొరికేవికావు. ఉత్తర అమెరికాలోని ఆదిమవాసులు చిత్రములు చిత్రించుటకై మొట్ట మొదట గేదె చర్మమును తీసుకొనివచ్చి శుభ్ర పరచి తరువాత ఆకులలముల నుండి, కొన్ని ప్రదేశములలో ఖనిజముల నుండికూడ ఉడకబెట్టిగాని, పిండిచేసిగాని, జంతువుల క్రొవ్వుతో కలిపి వర్ణములను తయారుచేసెడివారు. అటు పిమ్మట వారు చిత్రింప దలుచుకొన్న చర్మమును ఎత్తు పల్లములు లేకుండుటకు నేలమీద అదిమిపట్టి దానిమీద బలముగా ఆ గీతనే చర్మము లోనికి రంగు బాగుగ యింకునట్లు మరల మరల వేసెడివారు. ఆనాటి చిత్రలేఖనము యింతకష్టముతో కూడుకొనిన పని.

ఆదిమవాసులు పలులోహ విగ్రహములను కూడ చేసెడివారు. మన దేశమునందలి ఆదిమవాసులు

శాస్త్ర యుక్తముగా రాగి విగ్రహములు చేసెడివారు. ముందు మట్టి ప్రతిమలను చేసి ఆ ప్రతిమను మైనములో కప్పి దాని కిరుప్రక్కలన రెండు సన్నటి లోహ గొట్టములను అతికించి మరల ఆ ప్రతిమనంతటిని మృదువైన మట్టిలో కప్పివేసెడివారు. ఆ మట్టి గట్టిపడిన తరువాత పై నున్న లోహ గొట్టము నుండి కరగబెట్టిన లోహమును పై గొట్టమునుండి పోసెడివారు. ఆ లోహము ప్రతిమ మట్టి అచ్చులకు మధ్య మైనములో నిండిన భాగమును ప్రవేశించి మైనమును కరిగించివేసి దాని చోటును తానాక్రమించుకొనును, కరిగిన మైనము క్రింది గొట్టము ద్వారా వెలుపలకు వచ్చివేయును. లోహము చల్లారిన పిదప పైనా, లోపల వున్న మట్టి అచ్చులను జాగ్రత్తగా తీసివేసెడివారు. అప్పుడు రాగి విగ్రహము రూపొందెడిని. కొనది కొంచము కరుకుగా నుండును గావున దానిని మరల ఉలి ఆకురాయిలతో సరదిద్దెడివారు. ఈ పద్ధతి మన దేశమున నుండి ఆఫ్రికా, సుమిత్రా మొదలైన ప్రదేశములకు వ్యాపించినదట ఈ పద్ధతినే యితర లోహ ప్రతిమలు చేయబడుచుండెడివి. ఈ పద్ధతి ననుసరించి ఆఫ్రికాలోని నిగ్రోలు కంచు విగ్రహములను సుమిత్రాలో ఇత్తడి విగ్రహములను చేసెడివారు. ఆ కాలమున పంతము, ప్రాణము ప్రతిమలు నోరా అవి నేర్పుతో చేయబడుచుండెడివి.

ఆసియాలోని ఆదిమవాసులు అనేక తెగలకు, జాతులకు చెందిన వారగుటచేతనూ, విభిన్న శీతోష్ణ పరిస్థితులలో జీవించుటచేతనూ, వారి చిత్రకళలో భేదములుండుట సహజమే. చైనా ఆదిమవాసులు మృణ్మయ కంచు పాత్రలందలి చిత్రకళ ఈ నాటి చిత్రకారులను సంభ్రమ ఆశ్చర్య చకితులను చేయుచున్నది. భారతదేశము నందలి ఆదిమవాసుల చిత్రకళ, ఆనాడు వారికి శిల్పసాంకేతిక విద్య లందుండిన నేర్పరితనమును అందరికి, చెప్పకనే చెప్పుచున్నది. కాని పాశ్చాత్య చరిత్రకారులు ఈ కళాపుంజములు ఏ కాలమునాటికి చెందినవో యింకను నిర్ణయించలేకున్నారు. ఏది ఎట్లున్నను మహెంజొదారో హరప్పాలోని శిల్ప విశిష్టత అందరికి విశదమైనది. ఈ మహెంజొదారో హరప్పావాసులు, మట్టి, రాయి, రాగి, స్టియాటైట్ (Soap stone) లో ప్రతిమలు చేసెడివారు. మన దేశమున ఈ ఆదిప్రాచీన చిత్రకళ యిప్పటికిని పూర్తిగా నశించిపోలేదు. నీలగిరి కొండలలో నివసించుచున్న తోడాలు, అస్సాము కొండలలో నివసించుచున్న నాగాలు ఈ చిత్రకళను అవలంబించుచున్నారు.

స్త్రీ సంక్షేమం



నీలగిరిలోయిలోని ఒకసంక్షేమ కేంద్రంలో ఒక కొండజాతి వనిత కుట్టు మిషనుతో కుట్టడం నేర్చు కొంటూంది.

ఆగస్టు 1954 నుండి కేంద్ర సంక్షేమ సంస్థ వెల్ఫేర్ ఎక్స్ టెన్షన్ ప్రాజెక్టులు ప్రారంభించింది. అప్పనుండీ దరిదాపు పదివేల పల్లెలు యీ ప్రోజెక్టుల క్రిందకు కొని రాబడ్డాయి. కమ్యూనిటీ ప్రాజెక్టులతో సహకరిస్తూ, స్త్రీ,శిశుసంక్షేమానికి సంబంధించిన సమస్యలలో ప్రత్యేకకృషి సల్పుతున్నారు. ఆటస్థలాలు, ఆరోగ్య కేంద్రాలు, శిశు, స్త్రీవికాసకేంద్రాలుపిల్లలకి సాంఘిక విద్యాజ్ఞాన బోధన, చేతి పనులలో, యితరత్రా అనేక వికాస కార్యక్రమాలు స్త్రీలకి అందుబాటులోకి తేబడుతున్నాయి.

ఆదిమవాసుల చిత్రలేఖనం

ఇప్పటి చరిత్రకారులు అమెరికాలోని ఆదివాసులు ఆసియాఖండమునుండి కొన్ని వేల సంవత్సరముల పర్యంతరము గుంపులుగుంపులుగా వలస వచ్చిన అభిప్రాయ పడుచున్నారు. అమెరికా ఆదివాసులు ఆసియా ఆదివాసులు ఒక తెగకే చెందిన వారగుట చేతనూ, వారిరువురి మానసిక పరిస్థితి యొక్కటే అగుటచేతనే, కాబోలు ఆసియా ఆదిప్రాచీన చిత్రకళకును, అమెరికా ఆదిప్రాచీన చిత్రకళకును అనేక పోలికలు కనపడుచున్నవి.

ఉత్తర అమెరికాలోని ఎస్కిమోలు దంతముమీద నేలమీద ఎముకతో శునకములను చిత్రించియున్నారు. అమెరికాలో కూడ ముఖములకు తగిలించుకొను కృత్రిమ మృగములు విరివిగా చిత్రింపబడుచుండెడివి. ఇవి దేవదారు వృక్షము మీద నలుపు, తెలుపు, ఎఱుపు, నీలము, ఒక విధమైన లేత ఆకుపచ్చ వర్ణములతో చిత్రింపబడేవి. వీరు పూసలతో సాంకేతికమైన బహుచక్కటి చిత్రములను చిత్రించుచుండిరి. వీరు ఎనుము చర్మము మీదను, జాతి మీదను, మృణ్మయ పాత్రల మీదను, గృహాలమీదను వీరు పలు విధములను చిత్రించుచుండిరి. వీరు మొదట నది, నేలలందు ప్రయోగించి, వీరు గుహ చిత్రములు (ఖనిజాలతో రంగులను) కూడ వేసెడివారు. ఈ గుహ చిత్రములు ఉన్నవి సుందర్యములుగా వీటి మరలా ఎప్పుడు సమయముగా తుడిచి వేసెడివారు. వీరు కూడ మా వారివలెనే రాక్షసులను కోరలతో చిత్రించెడివార్.

ఇట్టిది ఆ నాటి ఆదిమవాసుల ఆదిప్రాచీరచిత్రకళ ఈ నాడు ఆధునాతక చిత్రకారులుగా పిలబడుచున్న గాగిన్, మీద్గ్గాని, పికాసో వంటివారు ఆదిప్రాచీన చిత్రకళ, ఔనత్యమును గ్రహించి చిత్రకళలందలి కొన్ని అంశములను అనుకరించుచు ఆధునాతని చిత్రకళన్న కొత్త పేరుతో ఒక విధముగ ఆ చిత్రకళకు పునర్జన్మ యిచ్చుటకు ప్రయత్నించుచున్నారు.

ఆదిప్రాచీన చిత్రకళకు దోహదమిచ్చిన ఆ నాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, మానసిక మత, నైతిక పరిస్థితులు ఈ నాటి పరిస్థితులకు భిన్నముగా నున్నప్పుడు ఆ నాటి చిత్రకళను ఈ నాడు అవలంబింప ప్రయత్నించుట నిష్ప్రయోజనము. ★

ఆంధ్ర మహిళా సభ

మైలాపూర్ - మద్రాసు

మహిళా విద్యాలయము	: హిందీ కాశీవిశ్వవిద్యాలయపు ఎడ్మిషన్, ఇంటర్మీడియెట్, ఆంధ్ర మెట్రిక్, ఇ ఎస్ ఎల్.సి . పరీక్షలకు శిక్షణ.
పారిశ్రామిక విద్యాలయము	: కుట్టు, ఎంబ్రాయిడరీ ఊలు అల్లికలు, నూలు వడకుట, చేనేత, అచ్చుకూర్పు, ముద్రణ, బైండింగ్ ఇత్యాది పరిశ్రమలలో గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ, బీద విద్యార్థినులకు ఉచితము.
పారిశ్రామిక శిక్షణ కేంద్రము	: 7-వ లోజరీ చర్చిరోడ్డులో ఆంధ్ర మహిళాసభ పారిశ్రామిక భవనములో వస్త్రములపై అద్దకపుపని, మిషనుకుట్టు, మిషను అల్లిక, చేనేత, బుక్ బైండింగు, ఎంబ్రాయిడరీ మొదలగు పరిశ్రమలలో శిక్షణ ఇవ్వబడుచున్నది.
టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్	: స్త్రీలకు టైపు — గవర్నమెంటు పరీక్షలకు శిక్షణ.
మహిళా మందిరము	: స్త్రీ విద్యార్థినులకు వసతి గృహము.
ఆంధ్ర మహిళ	: స్త్రీలలో విద్యా వ్యాప్తికై స్త్రీలచే నడుపబడుచున్న సచిత్ర మాస పత్రిక
నర్సింగ్ హోమ్	: స్త్రీ శిశు సంరక్షణశాల, ప్రసూతిశాల, ఉచిత వైద్యశాల, కుటుంబ నియంత్రణశాఖ, దంత వైద్యశాఖ— అడయారులో నిర్మించబడినది భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖవారి విధానాన్ని అనుసరించి, సంక్షిప్త నర్స్ ఎయిడ్—మంత్రసాని పనులలో శిక్షణ యివ్వబడుచున్నది.
ముద్రణాలయము	: ఆంధ్ర మహిళా సభ వారిచే స్వంతంగా స్థాపించబడినది విద్యార్థినులకు అచ్చుకూర్పు, బైండింగ్, ప్రూఫు రీడింగు, మొదలైనవి ఉచితంగా నేర్పబడును.
నాగేశ్వర శిశువిహార్	: పిల్లల విద్యా వినోద కేంద్రం.
వనితా బాలవిహార్	: స్త్రీలకు, పిల్లలకు, పార్కు, ఆటస్థలం.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the month of February '59.

OUT-PATIENT REGISTER

No of Surgical cases treated	81
,, ,, Medical ,, ,,	1,261
,, ,, Ante-natal ,, ,,	331
,, ,, Post-natal ,, ,,	84
,, ,, Dental ,, ,,	16
,, ,, Gyneac ,, ,,	156
,, ,, E.E.N.T. ,, ,,	101
Total No. of New patients	2,030
,, ,, ,, Old patients	2,577
Grand total	4,607

ADMISSION REGISTER

No. of Patients admitted for deliveries	150
,, ,, Medical cases treated	85
,, ,, Gyneac ,, ,,	20
,, ,, Post-Natal ,, ,,	6
,, ,, Babies admitted as Lodgers	103
Grand total	364

IN-PATIENT MATERNITY REGISTER

No. of Normal deliveries	91
,, ,, Abnormal deliveries Forceps	9
Grand Total	100

Mrs. V. LAKSHMI PARVATHI
Secretary and Convener

Dr M. PAVANA BAI
Medical Superintendent.

Edited, Printed & Published by Mrs K. Lakshmi Raghuram, B A. at the Andhra Mahila Press
[illegible] Madras 4 Manager and Associate Editor Ramalakshmi Arudra